**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 47, పేజీలు - 08

బుధవారం, ఆగష్టు 12, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD









# రద్దీకి తగ్గట్లుగా కొత్త కోచ్ల కొనుగోలు

## మెట్రో రివ్యూలో రేవంత్ రెడ్డి ఆదేశం

- పాతబస్తీ మెట్రోకు టెండర్లు - డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ చర్చ
- పెట్టుబడుల్లో మరింత పురోగతి సాధించాలన్న సీఎం

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ మెట్రో విస్తరణలో కీలకమైన పాతబస్తీ కారిడార్ పనుల్లో కదలిక వచ్చింది. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు ప్రతిపాదించిన 7.5 కిలోమీటర్ల మెట్రో మార్గం పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశించారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఉన్నతాధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్షలో పాతబస్తీ మెట్రోతో పాటు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మేర నిర్మించనున్న మెట్రో కారిడార్‌కు సంబంధించిన పనులను త్వరితగతిన ముందుకు తీసుకెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఈ మార్గంలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయడంతో పాటు మెట్రో నిర్మాణ పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియను త్వరగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు విస్తరణ, భూసేకరణ, టెండర్ల ప్రక్రియలను సమన్వయం చేసుకుంటూ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా ముందుకు వెళ్లాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు.పాతబస్తీ ప్రాంతానికి మెట్రో సేవలు అందుబాటులోకి వస్తే అక్కడి ప్రజలకు ప్రజా రవాణా మరింత సులభతరం కావడంతో పాటు నగరంలోని ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు కూడా ఉపయోగపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. పాతబస్తీ కారిడార్ నిర్మాణంలో ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఇందుకోసం ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులను సంప్రదించి అవసరమైన సాంకేతిక సలహాలు, సూచనలు తీసుకోవాలని ఆదేశించారు.

2లో..

## వందేమాతరం బిల్లుకు

# రాష్ట్రపతి ఆమోదం

## - చట్టంగా మారిన కొత్త బిల్లు!




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** స్వాతంత్ర్య సమరంలో కోట్ల మంది భారతీయుల్లో దేశభక్తి ఆవేశాన్ని నింపిన 'వందేమాతరం' గేయానికి కేంద్ర ప్రభుత్వం అత్యున్నత చట్టపరమైన రక్షణ కల్పించింది. జాతీయ గీతం 'జనగణమన'కు ఏ స్థాయిలో గౌరవం, చట్టపరమైన రక్షణ ఉందో ఇకపై జాతీయ గేయం 'వందేమాతరం'కి కూడా అదే స్థాయి చట్టభద్రత లభించనుంది. పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదించిన 'జాతీయ గౌరవ అవమానాల నిరోధక (సవరణ) బిల్లు-2026'కి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. దీంతో ఈ కొత్త సవరణ చట్టంగా మారి అమల్లోకి వచ్చింది. ఇకపై వందేమాతరాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించినా, అది పాడుతున్నప్పుడు అడ్డంకులు సృష్టించినా తీవ్రమైన శిక్షార్హమైన నేరంగా పరిగణిస్తారు.

2లో..

## రేవంత్ సోదరులకు షెల్ కంపెనీలు..

# భారీగా లబ్ధి

- టెసరాక్ కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూమి కేటాయించారని విమర్శ
- కేవలం లక్ష రూపాయల మూలధనంతో కంపెనీ ఏర్పాటు చేశారని వెల్లడి
- సీఎం సోదరులు షెల్ కంపెనీల బాగోతం బయటపెడతామన్న కేటీఆర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కర్ణాటకలో మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సతీమణికి 3 ఎకరాల భూమి కేటాయించిన వ్యవహారంలో అక్కడి ప్రతిపక్షాలు ఫిర్యాదు చేయడంతో లోకాయుక్త విచారణ జరపడం, చివరకు ఆయన రాజీనామా దిశగా పరిస్థితులు వెళ్లాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తుచేశారు. కర్ణాటకలో ఒక రకమైన న్యాయం, తెలంగాణలో మరొక రకమైన న్యాయం ఎందుకని ఆయన తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు అనుముల కొండల్ రెడ్డికి చెందిన 'టెస్సెరాక్ట్' అనే సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా, 200 కోట్ల విలువైన 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేవలం రూ.7 కోట్లకే

2లో..

## అర్హులందరికీ న్యాయం చేస్తాం

- నిషేధిత భూములపై మంత్రి పొంగులేటి ఆదేశాలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో 22ఏ లేదా నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న భూములు, ఆస్తుల విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన పడాల్సిన అవసరం లేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2లో..

# ఎల్‌నినో ఉన్నా ప్రజలపై భారం పడొద్దు

## 15 శాతం వృద్ధిరేటే లక్ష్యమన్న సీఎం చంద్రబాబు



- ఏపీ ఆర్థిక వృద్ధిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- 2025-26 రెండో త్రైమాసికంలో 10.7శాతం వృద్ధిరేటు నమోదు
- ఎల్ నినో ప్రభావం, ధరల పెరుగుదలపై సీఎం ఆందోళన

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా నిలకడైన వృద్ధి నమోదు చేస్తోందని జూలై 2026 నెలవారీ ఆర్థిక నివేదిక స్పష్టం చేస్తోంది. గడచిన రెండేళ్లుగా జాతీయ వృద్ధి రేటు కంటే ఏపీ వృద్ధిరేటు మెరుగ్గా నమోదు అవుతోంది.

రాష్ట్ర స్థూల ఉత్పత్తి వాస్తవ వృద్ధి రేటు 2023-24లో 6.5 శాతం నమోదు చేస్తే 2025-26 ఆర్థిక సంవత్సరంలో 9.9 శాతానికి పెరిగింది.రాష్ట్రంలోని వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో గణనీయమైన వృద్ధి నమోదు అవుతున్నట్టు నెలవారీ ఆర్థిక నివేదిక పేర్కొంది.

'ఈమేరకు సీఎం క్యాంపు కార్యాలయంలో ప్రణాళికా విభాగం అధికారులు 2026 జూలై ఆర్థిక నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందించారు. 2025-26 రెండో త్రైమాసికంలో వ్యవసాయ రంగం 13.5 శాతం మేర వృద్ధి నమోదు చేసింది. పారిశ్రామిక రంగం 10.6 శాతం మేర, సేవా రంగం 9.9 శాతం వృద్ధితో ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలిచాయి'అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

2లో..

# దేశ నిర్మాణంలో భాగస్వాములు కండి

## - సీఎం చంద్రబాబు పిలుపు

- 'పార్ట్‌నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్'కు సీఎం చంద్రబాబు పిలుపు
- 'రోడ్ డాక్టర్' పేరుతో గుంతల్లేని రహదారుల మిషన్
- ప్రజలు, ఉద్యోగులు అంతా భాగస్వాములు కావాలని సూచన



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ప్రజలు, ఉద్యోగులు, అధికారుల సమష్టి భాగస్వామ్యంతో 'పార్ట్‌నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులే లక్ష్యంగా 'రోడ్ డాక్టర్' పేరుతో 'జీరో పాట్ హోల్ మిషన్'ను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత

2లో..

# తెలంగాణలో కొత్త పెన్షన్లకు దరఖాస్తుల ఆహ్వానం

## - ఆగస్టు 31 వరకు దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ప్రభుత్వం చేయూత కొత్త పింఛన్లకు దరఖాస్తులను స్వీకరిస్తున్న సంగతి తెలిసిందే. తద్వారా అర్హులైన పేదలు, బలహీన వర్గాలకు సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా చేయూత సామాజిక భద్రత పింఛన్ పథకం కింద కొత్త పింఛన్ల మంజూరుకు చర్యలు చేపట్టింది. తొలిదశలో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ వ్యాధి, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్టుగా ప్రభుత్వం తెలిపింది. అయితే కొత్త పింఛన్లకు సంబంధించి అర్హత ప్రమాణాలపై సర్కార్ క్లారిటీ ఇచ్చింది. కొత్త పింఛన్ల కోసం అర్హత ప్రమాణాల్లో ఎలాంటి మార్పు చేయలేదని తెలిపింది. గత ప్రభుత్వాల హయాంలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న ఎలిజిబిలిటీ క్రైటీరియానే ఇప్పుడు కూడా ప్రామాణికంగా తీసుకుంటున్నట్టుగా పేర్కొంది. 2014 నుంచి 2018 మధ్య జారీ చేసిన సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వుల్లోని నిబంధనల ప్రకారమే అర్హతను పరిశీలిస్తారని తెలిపింది. అంతేకాకుండా చేయూత పింఛన్ల కోసం ప్రజాపాలన వారోత్సవాలు, 99 రోజుల ప్రగతి ప్రణాళిక గ్రామసభలు, ప్రజావాణిలో ఇప్పటికే అందిన దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకుంటామని తెలిపింది. గతంలో దరఖాస్తు చేసి, అవసరమైన అన్ని పత్రాలు సమర్పించిన వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని పేర్కొంది. అవసరమైన పత్రాలు సమర్పించని వారు లేదా ఇప్పటి వరకు దరఖాస్తు చేయని

2లో..

# తెలంగాణకు ఎస్ఐఆర్ షాక్

## - గ్రేటర్ లోనే ప్రతి ముగ్గురిలో ఒకరి ఓటు గల్లంతు!




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా తొలిదశ ఎన్యూమరేషన్ పూర్తి కావడంతో ఓటర్ల రికార్డుల్లో భారీ తరుగుదల కనిపించింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 73.52 లక్షలకు పైగా ఓటర్ల వివరాలు లభించకపోగా, ఇందులో అత్యధిక భాగం హైదరాబాద్ దాని చుట్టుపక్కల అర్బన్ ప్రాంతాల్లోనే నమోదైంది. తెలంగాణ మొత్తం ఓటర్లలో 21.7% మంది పేర్లు తొలిదశ లెక్కల్లో లేకపోగా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే అత్యంత తీవ్రమైన ప్రభావం పడింది.

2లో..

# కేబీఆర్ పార్క్ రూట్‌లో వన్‌వే

## - ఏడాదిన్నర వరకు ట్రాఫిక్ ఆంక్షలు




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ వాసులకు ట్రాఫిక్ పోలీసులు కీలక అలర్ట్ జారీ చేశారు. నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాల్లో ఒకటైన కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ఈనెల 18వ తేదీ నుంచి వన్‌వే ట్రాఫిక్ విధానం అమల్లోకి రానుందని వెల్లడించారు. హెచ్-సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా పార్క్ చుట్టూ అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్ల నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు.

2లో..

# హైదరాబాద్‌లో ట్రంప్ ట్విన్ టవర్స్

## - 65 అంతస్తుల్లో 450 ఆల్ట్రా లగ్జరీ ఫ్లాట్లు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో మరో భారీ ప్రాజెక్ట్ అడుగుపెట్టబోతోంది. ఇప్పటికే దేశ, విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తున్న కోకాపేటలో ఇప్పుడు 'ట్రంప్ టవర్స్' నిర్మాణానికి రంగం సిద్ధమైంది. గోల్డెన్ మైల్ రోడ్డులో 65 అంతస్తులతో రెండు అత్యాధునిక ట్విన్ టవర్లను నిర్మించనున్నారు. అమెరికాకు చెందిన ట్రంప్ ఆర్గనైజేషన్, ట్రిబెకా డెవలపర్స్, హైదరాబాద్‌కు చెందిన ఐరా రియాల్టీ సంస్థలు సంయుక్తంగా ఈ ట్రంప్ టవర్స్ ప్రాజెక్ట్‌ను చేపడుతున్నాయి. సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్ట్ రూపుదిద్దుకోనుంది. ఈ ట్విన్ టవర్స్‌లో మొత్తం 450 అల్ట్రా లగ్జరీ ఫ్లాట్లు అందుబాటులోకి రానున్నాయి. 3.5 బీహెచ్‌కే, 4 బీహెచ్‌కే, స్కై డుప్లెక్స్ వంటి విభాగాల్లో ఈ నివాసాలను రూపొందించనున్నట్లు సమాచారం. గ్లాస్ ఫసాడ్, స్మార్ట్ హోమ్ టెక్నాలజీ, ప్రైవేట్ వ్యూయింగ్ డెక్స్ వంటి ఆధునిక సదుపాయాలు

2లో..

# రద్దీకి తగ్గట్లుగా కొత్త కోచ్ల కొనుగోలు

ఆధునిక టెక్నాలజీని ఉపయోగించడంతో పాటు నిర్మాణం, నిర్వహణ, ప్రయాణికుల సౌకర్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మరోవైపు హైదరాబాద్ మెట్రో రైళ్లలో రోజురోజుకూ పెరుగుతున్న ప్రయాణికుల రద్దీపై కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రస్తుతం ఉన్న రైళ్ల సామర్థ్యానికి అదనంగా కొత్త కోచ్‌లను కొనుగోలు చేసి వాటిని మెట్రో రైళ్లకు జత చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన కొనుగోలు ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు. పీక్ అవర్స్‌లో ప్రయాణికుల రద్దీని తగ్గించడంతో పాటు మెట్రో సేవల సామర్థ్యాన్ని పెంచేందుకు అదనపు కోచ్‌లు కీలకంగా మారనున్నాయి. నగరంలో మెట్రోకు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందుగానే చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో సమ్మిట్ ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని, గత సంవత్సరం నిర్వహించిన సమ్మిట్లో తెలంగాణ రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, పురోగతికి సంబంధించి పూర్తి వివరాలను ఇవ్వాలని అధికారులను రేవంత్ రెడ్డి ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. సమావేశంలో సీఎం సలహాదారు రామకృష్ణరావు, సీఎస్ సంజయ్ జాజు, ఉన్నతాధికారులు ఎస్వీఎస్ రెడ్డి, సర్ఫరాజ్ అహ్మద్, అజిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# వందేమాతరం బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

### రాష్ట్రపతి ముద్రతో రూపుదిద్దుకున్న చట్టం

1971 నాటి జాతీయ గౌరవ అవమానాల నిరోధక చట్టానికి కేంద్రం ఈ నూతన సవరణలు చేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో విపక్షాల నిరసనల నడుమ ఉభయ సభలు ఈ బిల్లును ఆమోదించాయి. రాష్ట్రపతి ఆమోదం లభించడంతో వందేమాతరం గేయానికి ఇకపై సంపూర్ణ చట్టపరమైన రక్షణ లభించింది. గతం నుంచి జాతీయ గీతానికి అందుతున్న గౌరవాన్ని, నిబంధనలను ఇకపై వందేమాతరానికి కూడా వర్తింపజేస్తూ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. దేశ ప్రతిష్ఠను, జాతీయ చిహ్నాలను కాపాడుకోవడంలో ఇది మరో చారిత్రాత్మక ఘట్టమని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

### పార్లమెంట్ వేదికగా రాజకీయ కాక

ఈ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందే క్రమంలో అధికార, విపక్షాల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ నిర్ణయాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా తప్పుపట్టాయి. శశి థరూర్, కనిమొళి వంటి ప్రతిపక్ష నాయకులు సభలో, సామాజిక మాధ్యమాల్లో తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయం సమాఖ్య వ్యవస్థకు, లౌకికత్వానికి విరుద్ధంగా ఉందంటూ డీఎంకే ఎంపీ కనిమొళి మండిపడ్డారు. గతంలో రాజ్యాంగ పరిషత్ కేవలం మొదటి రెండు చరణాలను మాత్రమే అధికారికంగా గుర్తించిందని, కానీ ఇప్పుడు ప్రభుత్వం అన్ని చరణాలను నిర్బంధం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆమె ఆరోపించారు.

### సాంకేతిక సమస్యలు వర్సెస్ జాతీయ గౌరవం

మరోవైపు కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ఈ చట్టం అమలులోని ఆచరణాత్మక ఇబ్బందులను లేవనెత్తారు. అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గీతం, జాతీయ గేయంతో పాటు కొన్ని రాష్ట్రాల్లో రాష్ట్ర గీతాలను కూడా పూర్తిగా ఆలపిస్తే ప్రేక్షకులు ప్రతి సభకు ముందు, తర్వాత దాదాపు 12 నిమిషాల పాటు నిలబడాల్సి వస్తుందని, ఇది ఎంతవరకు సాధ్యమని ఆయన ప్రశ్నించారు. చట్టాల ద్వారా బలవంతంగా దేశభక్తిని, సహనాన్ని రప్పించలేమని వ్యాఖ్యానించారు. అయితే ఈ ఆరోపణలను బీజేపీ ఎంపీ సంబిత్ పాత్ర తీవ్రంగా ఖండించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు వందేమాతరానికి ఇవ్వాల్సిన తగిన ప్రాధాన్యతను, గౌరవాన్ని ఇవ్వడంలో విఫలమయ్యాయని, అందుకే తమ ప్రభుత్వం ఈ చారిత్రక సవరణను తీసుకొచ్చిందని సభలో సమర్థించుకున్నారు.

# రేవంత్ సోదరులకు షెల్ కంపెనీలు.. భారీగా లబ్ధి

కేటాయించి తీవ్ర కుంభకోణానికి పాల్పడ్డారని కేటీఆర్ ఆరోపించారు.

### కొండల్ రెడ్డి లింక్డ్ ఇన్ ప్రొఫైల్ లోనే ఉంది

ఈ 'టెస్సెరాక్ట్' అనే కంపెనీకి కొండల్ రెడ్డి స్వయంగా చైర్మన్‌గా ఉన్నట్లు ఆయన తన లింక్డ్ఇన్ ప్రొఫైల్‌లోనే స్పష్టంగా నమోదు చేసుకున్నారని కేటీఆర్ తెలిపారు. ఆ కంపెనీ ఏరోస్పేస్, డిఫెన్స్ రంగ పరికరాలను తయారు చేస్తుందని ప్రచారం చేసుకుంటూ హైదరాబాద్‌లో అమెరికా ఎంబసీ ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ డెవలప్‌మెంట్ ఫోరమ్ ఎగ్జిక్యూటివ్ బోర్డులో కూడా ఆయనకు సభ్యత్వం ఇచ్చినట్లు ప్రకటనలు వచ్చాయన్నారు. అసలు కొండల్ రెడ్డి విద్యార్హతలు ఏంటో కూడా తెలియకుండా, కేవలం సీఎం సోదరుడైనంత మాత్రాన అత్యున్నత పదవుల్లో ఎలా కూర్చుంటున్నారని ఎద్దేవా చేశారు.

### కాంటాక్ట్ నెంబర్ 123456789 అంట

ఈ 'టెస్సెరాక్ట్' కంపెనీ వివరాలు, కార్యకలాపాలపై లోతుగా ఆరా తీయగా అనేక అనుమానాస్పద విషయాలు బయటపడ్డాయని కేటీఆర్ చెప్పారు. కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌లో ఫోన్ నంబర్ "123456789" అని నమోదై ఉందంటేనే ఈ సంస్థ తీరు అర్థమవుతోందని విమర్శించారు. మార్చి 31, 2025 నాటికి కంపెనీ సమర్పించిన నివేదికల ప్రకారం ఈ సంస్థలో ఒక్క ఉద్యోగి కూడా పనిచేయడం లేదని, కంపెనీ ప్రారంభ మూలధనం కేవలం లక్ష రూపాయలేనని తేలిందన్నారు. ఎలాంటి అనుభవం, ఉద్యోగులు లేని ఒక షెల్ కంపెనీకి రూ. 200 కోట్ల విలువైన 5 ఎకరాల అత్యంత విలువైన ప్రభుత్వ స్థలాన్ని కేవలం రూ. 7 కోట్లకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కట్టబెట్టిందని కేటీఆర్ మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి తన సొంత కుటుంబాన్ని పోషించడానికి తెలివిగా ఈ భూ కుంభకోణానికి తెరలేపారని ఆయన ధ్వజమెత్తారు. అమెరికాలో ఉండే రేవంత్ మరో సోదరుడు జగదీష్ రెడ్డికి చెందిన 'స్వచ్ఛ్ బయో' కంపెనీతో రూ. 1,000 కోట్ల ఒప్పందం కుదుర్చుకున్నారని, రూ. 1,137 కోట్ల అమృత్ పథకం కాంట్రాక్టును కట్టబెట్టారని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వీటితో పాటు సింగరేణి వ్యవహారాలు కూడా వారి కనుసన్నల్లోనే సాగుతున్నాయని ఆరోపించారు. ఈ కేటాయింపులతో, కంపెనీతో సీఎం రేవంత్ రెడ్డి సోదరుడికి సంబంధం లేదని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సమర్థించుకోవడంపై కేటీఆర్ మండిపడ్డారు. కొండల్ రెడ్డి స్వయంగా చైర్మన్ అని ప్రచారం చేసుకుంటుంటే మంత్రి దాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం అన్న తిరుపతి రెడ్డికి ఎలాంటి అధికారిక హోదా లేకపోయినా ప్రభుత్వ అధికారులు ఆయనకు వంగివంగి దండాలు పెడుతున్నారని విమర్శించారు. ఈ భూ కుంభకోణం వెనుక ఉన్న అసలు నిజాలు బయటపడేవరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# అర్హులందరికీ న్యాయం చేస్తాం

భరోసా ఇచ్చారు. చట్టబద్ధంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న సాంకేతిక, చట్టపరమైన సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కొత్తగా తమ ప్రభుత్వం ఎలాంటి భూములను నిషేధిత జాబితాలో చేర్చలేదని వెల్లడించారు. 22ఏ, పీఓబీ అంశాలపై మంగళవారం సచివాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లతో మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను జిల్లాల వారీగా సమీక్షించారు. అర్హులైన బాధితులకు వీలైనంత త్వరగా ఊరట కల్పించాలని అధికారులను పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. భూముల రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూసేకరణ (ప్రొసీడింగ్స్), లేఅవుట్ అనుమతులు సహా అన్ని రికార్డులను ఈనెల 14వ తేదీలోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ విధానం ద్వారా బోగస్ లేదా ఫోర్జరీ పత్రాలను గుర్తించడంతో పాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో మరింత పారదర్శకత తీసుకురావచ్చని మంత్రి చెప్పారు. పహాణీలను కూడా సబ్ రిజిస్ట్రార్లకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నిషేధిత జాబితాలోని ఆస్తుల రిజిస్ట్రేషన్ దరఖాస్తులను సబ్ రిజిస్ట్రార్లు గుడ్డిగా తిరస్కరించకూడదని పొంగులేటి స్పష్టం చేశారు. ఏదైనా దరఖాస్తును తిరస్కరించాల్సిన పరిస్థితి ఉంటే కారణాలను పరిశీలించేందుకు 3 రోజుల సమయం తీసుకుని.. స్పష్టమైన వివరణ ఇవ్వాలని సూచించారు. ప్రతి కేసును వివిధ కోణాల్లో పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని ఆదేశించారు. ఇకపై నిషేధిత జాబితాకు సంబంధించిన దరఖాస్తులను తహసీల్దార్లకు పంపకుండా నేరుగా జిల్లా కలెక్టర్లకు పంపించాలని మంత్రి పొంగులేటి నిర్ణయించారు. కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్ స్థాయిలోనే సంబంధిత వ్యవహారాలను సమన్వయం చేయాలని సూచించారు. సబ్ రిజిస్ట్రార్ల విచక్షణాధికారాలను పరిమితం చేసి.. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న ధ్రువీకరించిన వివరాల ఆధారంగానే రిజిస్ట్రేషన్‌పై నిర్ణయం తీసుకునే విధానం వ్యవస్థను రూపొందించాలని అధికారులను పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వ భూములు, ఆస్తుల పరిరక్షణ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ ఉండదని మంత్రి పొంగులేటి తేల్చి చెప్పారు. అదే సమయంలో 22ఏ నిబంధన పేరుతో చట్టబద్ధంగా హక్కు ఉన్న పేదలు, సాధారణ ప్రజలకు అన్యాయం జరిగితే సహించబోమని స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగా తప్పులు చేసే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజావాణి, కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లకు వచ్చిన 22ఏ, పీఓబీ దరఖాస్తులను ప్రతిరోజూ సమీక్షించాలని కలెక్టర్లను ఆదేశించారు. సమస్య వచ్చిన తర్వాత పరిష్కరించడం కంటే ముందుగానే లోపాలను గుర్తించి ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడటం అధికారుల బాధ్యత అని సూచించారు.

# ఎల్‌నినో ఉన్నా ప్రజలపై భారం పడొద్దు

### పెట్టుబడుల ప్రవాహం కూడా ఆశాజనకంగా ఉంది

'పశుసంవర్ధక శాఖలో మాంసం ఉత్పత్తి 9.6 శాతం, గుడ్ల ఉత్పత్తి 5.1 శాతం వృద్ధిని సాధించాయి. సేవా రంగంలో ఐటి, రవాణా, వాణిజ్య కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. సాధారణ ఎగుమతుల్లో రూ. 16,322 కోట్లతో 10.5 శాతం మేర వృద్ధి నమోదు అయ్యింది. ఎస్‌టిపిఐ ఎగుమతులు 32.2 శాతం మేర పెరిగాయి' సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అలాగే వాణిజ్య వాహనాల నమోదు 51.6 శాతం వృద్ధిని కనబరిచింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన టెక్నాలజీ ఇంటిగ్రేషనుతో జీఎస్టీ పన్ను వసూళ్లు 21 శాతం వృద్ధితో రూ.13,282 కోట్లకు చేరాయి. రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం కూడా ఆశాజనకంగా ఉంది. రూ. 2.88 లక్షల కోట్ల విలువైన మెగా ప్రాజెక్టుల పెట్టుబులు గ్రౌండింగ్ తో 75.4 శాతం మేర, రూ. 60 వేల కోట్ల మేర ఎంఎస్ఎంఈ రంగ పెట్టుబడులు 73.6 వృద్ధిని నమోదు చేశాయి. పన్ను, పన్నేతర ఆదాయాల్లో గణనీయంగా వృద్ధి నమోదు అయ్యింది. ఫలితంగా కూటమి ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూనే ప్రజా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోంది'.

### ఎల్ నినో సంక్షోభంలో లక్ష్యాల్ని సాధించాలి

ఎల్ నినో లాంటి సంక్షోభ సమయంలోనూ రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలను చేరుకునేలా ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రణాళికా విభాగం అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ ముందుకు వెళ్లాలని సీఎం సూచించారు. వాణిజ్య పన్నుల శాఖ తరహాలోనే అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ టెక్నాలజీని సమర్థంగా అనుసంధానించి లక్ష్యాలను చేరుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం ఉందని కృష్ణా నదిలో ప్రవాహాలు లేని కారణంగా శ్రీశైలం, నాగార్జున సాగర్ లాంటి ప్రాజెక్టులు ఇంకా పూర్తిగా నిండలేదని గోదావరికి వచ్చిన వరద ప్రవాహాలను మళ్లించి కృష్ణా డెల్టాకు నీరిచ్చామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

### తగ్గుతున్న భూ గర్భజలాలు

భూగర్భ జలాలు కూడా తగ్గుతున్నాయని ఈ నేపథ్యంలో స్థూల ఉత్పత్తి పడిపోకుండా వివిధ శాఖలతో సమన్వయం చేసుకుని కార్యాచరణ చేపట్టాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. సమాచారాన్ని సమగ్రంగా విశ్లేషించి లోటుపాట్లను సరిచేసుకోవాలన్నారు. ప్రతీ ప్రభుత్వశాఖ అత్యున్నత స్థాయి లక్ష్యాలను చేరుకునేలా వనరుల నిర్వహణ చేపట్టాలన్నారు. నిర్దుష్టమైన ప్రమాణాలను అనుసరించి ఫలితాలు వచ్చేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. రూపొందించే ప్రతీ ప్రణాళికా రాష్ట్ర వృద్ధిరేటును పెంచేలా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజలపై ఎలాంటి ధరల భారం పడకుండా చూడాలని దీనిపై ఓ కమిటీ వేయాలని సూచించారు. నీటి లభ్యత, ఉత్పత్తులకు విలువ జోడింపు లాంటి అంశాలపై సూచనాత్మక కంటిజెన్సీ ప్రణాళిక తయారు చేయాలన్నారు. ఏపీ 15 శాతం వృద్ధిరేటు సాధించేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి కావాల్సిన ఉత్పత్తులపై ప్రభావం లేకుండా చూడాలన్నారు. జిల్లా, నియోజకవర్గం, మండలవారీగా నివేదికలు ఇస్తే లక్ష్యాల సాధన సులువు అవుతుందని సీఎం చంద్రబాబు సూచించారు. ఈ సమీక్షకు ఆర్థిక, ప్రణాళికా శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, ప్రణాళికా విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీఆర్ అలపర్తి, సీఎంఓ అధికారులు రాజమౌళి, ప్రద్యుమ్న తదితరులు హాజరయ్యారు.

# తెలంగాణలో కొత్త పెన్షన్లకు దరఖాస్తుల ఆహ్వానం

అర్హులు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అర్హత నిర్ధారణ కోసం సంబంధిత శాఖల నుంచి అవసరమైన ధ్రువపత్రాలను పొందేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకుంటారని ప్రభుత్వం తెలిపింది. వితంతువులకు భర్త మరణ ధ్రువపత్రం, ఒంటరి మహిళలకు సెపరేషన్ లేదా స్థానిక విచారణ నివేదిక, గీత కార్మికులకు ఎక్సైజ్ శాఖ ధ్రువీకరణ, చేనేత కార్మికులకు చేనేత-జౌళి శాఖ ధ్రువీకరణ, ఫైలేరియా బాధితులకు వైద్య ఆరోగ్య శాఖ ధ్రువీకరణ అవసరం అని పేర్కొంది. దరఖాస్తుల పరిశీలన అనంతరం నిర్దేశిత అధికారులు క్షేత్రస్థాయిలో అర్హతను తనిఖీ చేస్తారని ఆ తర్వాత అర్హుల జాబితాను జిల్లా స్థాయికి పంపి, జిల్లా కలెక్టర్ ఆమోదంతో పింఛన్ మంజూరు చేస్తారని తెలిపింది. అయితే ప్రతి అర్హుడికి చేయూత పింఛన్లు అందించాలనే ఉద్దేశంతో స్వయం సహాయక సంఘాల సమాఖ్యలకు కూడా బాధ్యతలు అప్పగించినట్టుగా కూడా తెలిపింది. ముఖ్యంగా ప్రతి అర్హత కలిగిన వితంతువు, ఒంటరి మహిళకు దరఖాస్తు చేసుకోవడం, అవసరమైన ధ్రువపత్రాలు పొందడంలో సహకరించాలని సూచించింది. కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను ఆగస్టు 31, 2026 వరకు స్వీకరించనున్నట్టుగా ప్రభుత్వం తెలిపింది. దరఖాస్తులతో పాటు వివరాలను చేయూత పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియను కూడా వెంటనే చేపట్టనున్నట్టుగా పేర్కొంది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా పారదర్శకంగా, నిబంధనల ప్రకారం ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు ప్రభుత్వం స్పష్టం చేసింది.

# దేశ నిర్మాణంలో భాగస్వాములు కండి

సులభతరంగా చేరువ చేయడం ద్వారా ప్రతి ఒక్కరినీ జాతి నిర్మాణంలో భాగస్వాములను చేయాలని ఆకాంక్షించారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రతి అధికారి, ఉద్యోగి అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టేలా 'రోడ్ డాక్టర్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని స్పష్టం చేశారు.ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి పనులను చిత్తశుద్ధితో చేపట్టినప్పుడు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందని, భోగాపురం విమానాశ్రయ పనుల పురోగతికి లభిస్తున్న స్పందనే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. వాస్తవాలను ప్రజలకు వివరిస్తే వారే ప్రభుత్వానికి అండగా నిలుస్తారని, కర్నూలులో డీఎస్సీ-2025 ఉపాధ్యాయ అభ్యర్థులు చేపట్టిన కార్యక్రమమే ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. జులై నెలలో రాష్ట్రం 10.70 శాతం ఆర్థిక వృద్ధిని సాధించిందని వెల్లడించిన ఆయన, రాబోయే రోజుల్లో ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణకు ఎస్ఐఆర్ షాక్

సుమారు 40 శాతం ఓట్లు జాబితా నుంచి గల్లంతయ్యాయి.

### తెలంగాణ ఎస్ఐఆర్ తొలిదశ లెక్కింపు

పాత జాబితా ఓటర్ల సంఖ్య : 3,38,26,448
లభించిన ఎన్యూమరేషన్ ఫారమ్‌లు : 2,64,73,616
వివరాలు లభించని ఓటర్లు : 73,52,832 (21.7% తగ్గింది)
హైదరాబాద్ అర్బన్ బెల్ట్ లో తగ్గినవి : 43,00,000 ఓట్లు
గ్రామీణ జిల్లాల్లో తగ్గిన ఓట్లు : 28,00,000 - 29,00,000

### హైదరాబాద్ నగర పరిధిలోనే ఓట్ల భారీ కోత

హైదరాబాద్, రంగారెడ్డి మరియు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లోని 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2023 అసెంబ్లీ ఎన్నికల నాటికి 1.14 కోట్లుగా ఉన్న ఓటర్ల సంఖ్య, ప్రస్తుత ఎన్యూమరేషన్ లెక్కల ప్రకారం 71 లక్షలకు పడిపోయింది. అంటే కేవలం రాజధాని ప్రాంతంలోనే 43 లక్షల ఓట్లు తగ్గాయి. ప్రస్తుత గణాంకాల ప్రకారం హైదరాబాద్ పరిధిలో ప్రతి ముగ్గురు ఓటర్లలో ఒకరి ఆచూకీ తొలిదశ రికార్డుల్లో నమోదు కాలేదు.

2023 ఎన్నికల సమయంలో ఈ మూడు జిల్లాల్లోని మొత్తం జనాభాలో దాదాపు 90% మంది ఓటర్లుగా నమోదు కాగా, ప్రస్తుత ఎస్ఐఆర్ ఫారమ్‌ల ఆధారంగా ఆ నిష్పత్తి 57% కి తగ్గిపోయింది. హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో 10 చోట్ల 40% కంటే ఎక్కువ ఓట్లు గల్లంతయ్యాయి. అలాగే రంగారెడ్డిలోని 8 నియోజకవర్గాల్లో 3 చోట్ల, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉప్పల్‌లో 39.95% ఓటర్ల వివరాలు లభించలేదు.

### తదుపరి కార్యాచరణ: మీ ఓటును ఎలా పునరుద్ధరించుకోవచ్చు?

ఎన్నికల సంఘం ప్రకారం, ప్రచురించబడిన 73.52 లక్షల లేదా హైదరాబాద్‌కు చెందిన 43 లక్షల సంఖ్య ఫైనల్ కాదు. ఒకవేళ పొరపాటున ఓటు తొలగించబడితే అర్హులైన ప్రతి పౌరుడికి తమ ఓటు తిరిగి పొందేందుకు అవకాశం కల్పిస్తూ సమగ్ర షెడ్యూల్‌ను ప్రకటించింది. ముసాయిదా ప్రచురణ (ఆగస్టు 17): తెలంగాణ సిఇఓ (సీఈఓ) ముసాయిదా ఓటర్ల జాబితాను అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో మరియు హైదరాబాద్‌లోని మున్సిపల్, రెవెన్యూ, వార్డు ఆఫీసుల్లో ప్రదర్శిస్తారు. నోటీసులు ఒ స్పందన సమయం (సెప్టెంబర్ 16 వరకు): ముసాయిదా జాబితాలో పేర్లు లేని లేదా వివరాల్లో లోపాలున్న ఓటర్లకు నోటీసులు ఇస్తారు. కమిషన్ అనుమతించిన 11 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదాన్ని సమర్పించి మీ ఓటు హక్కును నిరూపించుకోవచ్చు. కొత్తగా పేరు నమోదు (ఫారం 6): ఓటర్ల జాబితాలో పేరు అసలు లేని అర్హులైన పౌరులు ఫారం 6 (ఫారం 6) ద్వారా ఆన్‌లైన్ లో కానీ, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా కానీ, లేదా మీ బిఎల్ఓ కి నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆఖరి జాబితా ప్రచురణ (అక్టోబర్ 19): అభ్యంతరాలు, సవరణలు మరియు కొత్త దరఖాస్తులను పరిశీలించిన అనంతరం ఆఖరి జాబితాను విడుదల చేస్తారు.హైదరాబాద్ ఓటర్లు ఆగస్టు 17న విడుదలయ్యే ముసాయిదా జాబితాలో తమ వివరాలు సరిచూసుకుని, సెప్టెంబర్ 16 లోపు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఎన్నికల కమిషన్ సుచిస్తోంది..

# కేబీఆర్ పార్క్ రూట్‌లో వన్‌వే

ఈ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు ఈ ట్రాఫిక్ మార్పులు కొనసాగనున్నాయి. ఈ క్రమంలోనే హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ వెల్లడించిన వివరాల ప్రకారం ఆగస్ట్ 18వ తేదీ ఉదయం 6 గంటల నుంచి కేబీఆర్ పార్క్ చుట్టూ ఉన్న 6 ప్రధాన జంక్షన్ల వద్ద వన్‌వే విధానం అమలు చేయనున్నారు. నిర్మాణ పనుల కారణంగా రహదారులపై అందుబాటులో ఉన్న స్థలం తగ్గిపోవడంతో వాహనాల రాకపోకల్లో అంతరాయం ఏర్పడకుండా ఈ మార్పులు చేపట్టారు. ప్రస్తుతం చేపడుతున్న ప్రాజెక్టులో సుమారు 110 పిల్లర్లు నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు.జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి పంజాగుట్ట వైపు వెళ్లే మార్గంలో ప్రత్యేక ట్రాఫిక్ ఏర్పాట్లు చేయనున్నారు. కేబీఆర్ పార్క్ చుట్టూ ఉన్న రోడ్లలో నిర్దేశించిన దిశలోనే వాహనాలను అనుమతించనున్నారు. కొత్త మార్గాలను ముందుగానే తెలుసుకుని వాహనదారులు ప్రయాణాలు ప్లాన్ చేసుకోవాలని పోలీసులు సూచించారు. రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వన్‌వే అమలు కోసం ట్రాఫిక్ పోలీసులు ఇప్పటికే రెండు దశల్లో ట్రయల్ రన్‌లు నిర్వహించారు. ఏప్రిల్ 5వ తేదీ, జూన్ 21వ తేదీన ప్రయోగాత్మకంగా ట్రాఫిక్ మార్పులను పరిశీలించి ఆయా జంక్షన్ల వద్ద ఎదురయ్యే సమస్యలను ముందుగానే గుర్తించారు. ఆ అనుభవాల ఆధారంగా లేన్ మార్కింగ్‌లు, లేన్ ఛేంజర్లు, దిశానిర్దేశక బోర్డులను ఏర్పాటు చేశారు. వాహనదారులకు మార్గదర్శకత్వం అందించేందుకు కీలక ప్రాంతాల్లో 24 గంటలూ ట్రాఫిక్ సిబ్బంది అందుబాటులో ఉండనున్నారు. ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను పర్యవేక్షించేందుకు ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ), సీసీటీవీ నెట్‌వర్క్‌ను ఉపయోగించనున్నారు. అంతేకాకుండా 2 డ్రోన్ల ద్వారా రియల్‌టైమ్ ట్రాఫిక్ పరిస్థితులను అధికారులు గమనించనున్నారు. అవసరాన్ని బట్టి వన్‌వే మార్గాల్లో మార్పులు, అదనపు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టే అవకాశం ఉంది. గూగుల్ మ్యాప్స్ సహా నావిగేషన్ యాప్‌ల్లోనూ మార్గాలకు సంబంధించిన మార్పులను అప్‌డేట్ చేస్తున్నారు.కేబీఆర్ పార్క్ పరిసరాల్లో పలు కీలక ఆసుపత్రులు ఉండటంతో అత్యవసర సేవలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అంబులెన్స్‌లు, ఫైర్ ఇంజిన్ల రాకపోకలకు ఆటంకం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనదారులు అత్యవసర వాహనాలకు తప్పనిసరిగా మార్గం ఇవ్వాలని పోలీసులు సూచించారు. కేబీఆర్ పార్క్‌కు వాకింగ్ కోసం వచ్చే వారికీ ఇబ్బందులు లేకుండా రోడ్డు దాటేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. వాకర్లు, సందర్శకులు రోడ్లపై వాహనాలను నిలిపివేయకుండా నిర్ణీత పార్కింగ్ ప్రదేశాలను వినియోగించాలని సూచించారు. ఈ వన్‌వే విధానం సుమారు ఏడాదిన్నర పాటు కొనసాగవచ్చని సీపీ సజ్జనార్ తెలిపారు. నిర్మాణ దశలో కొంతకాలం ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురైనా.. ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ట్రాఫిక్ రద్దీ తగ్గడం, ప్రయాణ సమయం ఆదా కావడం, రహదారి భద్రత మెరుగుపడటం వంటి ప్రయోజనాలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. వాహనదారులు ట్రాఫిక్ మార్పులను గమనించి ముందుగానే ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సోషల్ మీడియాలో వచ్చే అనధికార సమాచారాన్ని కాకుండా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల అధికారిక సూచనలను మాత్రమే నమ్మాలని కోరారు.

# హైదరాబాద్‌లో ట్రంప్ ట్విన్ టవర్స్

ఉండనున్నాయి. 2 టవర్లను కలుపుతూ ప్రత్యేకంగా నిర్మించనున్న 'స్కై బ్రిడ్జ్' ఈ ప్రాజెక్ట్‌లో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఈ ట్రంప్ టవర్స్ ఎత్తు సుమారు 240 మీటర్లు ఉండనున్నట్లు డెవలపర్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే దక్షిణ భారతదేశంలోని అత్యంత ఎత్తయిన రెసిడెన్షియల్ టవర్లలో ఇవి నిలిచే అవకాశం ఉంది. అంతేకాకుండా భారతదేశంలో ట్రంప్ బ్రాండ్ కింద వస్తున్న ఎత్తయిన ప్రాజెక్టుల్లో ఒకటిగా కూడా గుర్తింపు పొందనుంది. ఈ ప్రాజెక్ట్ సాధారణ లగ్జరీ అపార్ట్‌మెంట్లకు భిన్నంగా పూర్తిస్థాయి అల్ట్రా లగ్జరీ విభాగాన్ని లక్ష్యంగా చేసుకుంది. ఒక్కో ఫ్లాట్ ధర సుమారు రూ.5 కోట్ల నుంచి ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్‌లో మొత్తం 16 పెంట్‌హౌస్‌లు ఉండగా వాటిలో ఇప్పటికే 8 అమ్మేసినట్లు ట్రిబెకా డెవలపర్స్ ఫౌండర్ కల్పేశ్ మెహతా వెల్లడించారు. ఒక పెంట్‌హౌస్ గరిష్ఠంగా సుమారు రూ.62 కోట్లకు విక్రయమైనట్లు తెలిపారు. భూమి విలువను మినహాయిస్తే ప్రాజెక్ట్ నిర్మాణానికి సుమారు రూ.1,700-1,800 కోట్ల వరకు వ్యయం కావచ్చని మొత్తం విక్రయాల ద్వారా రూ.3,500 కోట్ల నుంచి రూ.4,200 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని డెవలపర్లు అంచనా వేస్తున్నారు.ఈ ట్రంప్ టవర్స్ నిర్మాణ పనులు ప్రారంభమైన తర్వాత 3 ఏళ్లలో ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని ఆయా సంస్థలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. కోకాపేటలో ఇప్పటికే భారీ స్థాయిలో వాణిజ్య, నివాస ప్రాజెక్టులు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ట్రంప్ టవర్స్ రాకతో ఈ ప్రాంతానికి మరింత అంతర్జాతీయ గుర్తింపు వచ్చే అవకాశం ఉందని రియల్ ఎస్టేట్ వర్గాలు భావిస్తున్నాయి. ఔటర్ రింగ్ రోడ్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు సులభమైన కనెక్టివిటీ ఉండటం కోకాపేటకు ప్రధాన ఆకర్షణగా మారింది. ఈ నేపథ్యంలో ట్రంప్ బ్రాండ్‌తో రానున్న ట్విన్ టవర్లు హైదరాబాద్ లగ్జరీ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో కొత్త బెంచ్‌మార్క్‌గా నిలుస్తాయనే అంచనాలు వ్యక్తం అవుతున్నాయి. దేశంలోని పలు నగరాల్లో ట్రంప్ బ్రాండ్‌తో ప్రాజెక్టులు చేపట్టిన ట్రిబెకా డెవలపర్స్‌కు హైదరాబాద్ ప్రాజెక్ట్ దక్షిణ భారతదేశంలో ప్రత్యేకమైన అడుగుగా నిలవనుంది. ప్రాజెక్ట్‌కు సంబంధించి టీ-రెరా అనుమతులు లభించిన నేపథ్యంలో తదుపరి దశలో నిర్మాణ పనులు, అధికారిక లాంచ్ కార్యక్రమాలు వేగం పుంజుకునే అవకాశం ఉంది.

# ఆక్రమంగా తరలిస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

### - గోల్నాక జిందా తిలస్మాత్ నగర్ వద్ద పట్టుకున్న సివిల్ సప్లై ఎన్ఫోర్స్మెంట్ టాస్క్ ఫోర్స్ అధికారులు



హైదరాబాదు (ప్రశ్న న్యూస్) రేషన్ బియ్యం అక్రమ దందా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జోరుగా సాగుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆక్రమంగా తరలిస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై ఎన్ఫోర్స్మెంట్ టాస్క్ ఫోర్స్ టీం అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.హైదరాబాద్ సి ఆర్ ఓ కార్యాలయానికి చెందిన సిఎస్డిటి వసంత కుమారి, అంబర్ పేట సర్కిల్ ఏసీఎస్ఓ కార్యాలయానికి చెందిన సీనియర్ చెకింగ్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ రెహమాన్ ఖాన్ నుండి సివిల్ సప్లై ఎన్ఫోర్స్మెంట్ టాస్క్ ఫోర్స్ అధికారులకు సమాచారం అందినది. కొందరు రేషన్ బియ్యాన్ని ఆక్రమంగా తరలిస్తున్నట్లు ఫిర్యాదు అందినది. ఈ సమాచారం మేరకు సివిల్ సప్లై ఎన్ఫోర్స్మెంట్ టాస్క్ ఫోర్స్ అధికారులు సోమవారం తెల్లవారుజామున ఒంటిగంట ప్రాంతంలో గోల్నాక జిందా జిందా తిలస్మాత్ నగర్ లోని ధర్మకాట వద్ద అనుమానస్పదంగా కనిపించిన టీజీ 11టి 0799 నంబర్ మినీ వ్యాన్ ను అధికారులు అడ్డగించి అందులో ఉన్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని, వ్యాన్ ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన బియ్యాన్ని, మినీ వ్యాన్ ను అధికారులు అంబర్ పేట పోలీసులకు అప్పగించారు. వాహనానికి సంబంధించిన వ్యక్తిగా ఓల్డ్ మలక్ పేటకు చెందిన మహమ్మద్ రిజ్వాన్ అలీ గా అధికారులు గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# మేడ్చల్ గాయత్రీ డిగ్రీ కాలేజీలో ఘనంగా ఆషాఢ బోనాలు

**భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాల సమర్పణ..**

**సంప్రదాయాలకు పెద్దపీట వేసిన కళాశాల యాజమాన్యం**





మేడ్చల్( ప్రశ్న న్యూస్ )తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల పండుగను మేడ్చల్ గాయత్రీ డిగ్రీ కాలేజీలో ఘనంగా నిర్వహించారు. కళాశాల యాజమాన్య సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.

**భక్తిశ్రద్ధలతో బోనాల వేడుక**

ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని కళాశాలలో ప్రత్యేకంగా బోనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.

**యాజమాన్య సభ్యుల ఆధ్వర్యంలో..**

కళాశాల యాజమాన్య సభ్యులు శివ, గణేష్, శ్రీనివాస్, కమలాకర్ రెడ్డి, దేవరాజ్, సత్యనారాయణ ఆధ్వర్యంలో బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వారు పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

**తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా బోనాలు**

బోనాల పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంతో ముడిపడిన గొప్ప సాంస్కృతిక సంప్రదాయమని, విద్యార్థులకు చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాల ప్రాధాన్యతను తెలియజేయడం ఎంతో అవసరమని నిర్వాహకులు తెలిపారు.

**విద్యార్థుల్లో సంప్రదాయాలపై అవగాహన**

కళాశాల స్థాయిలో ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా యువతలో మన పండుగలు, ఆచారాలు, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. భక్తి, సంప్రదాయం, సాంస్కృతిక విలువలను కలగలిపిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది.
ఆషాఢ బోనాల సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు అందరికీ కలగాలని, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాల్గొన్న వారందరూ పరస్పరం బోనాల శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు

# అద్వానంగా గజ్వేల్-జాలిగామ బైపాస్ రోడ్డు

**గుంతలమయంగా మారిన రహదారి..**

**ప్రమాదాల ముప్పు వెంటనే మరమ్మతులు చేపట్టాలి**

**: బీజేపీ మండల అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పట్టణం నుంచి రామాయంపేటకు వెళ్లే జాలిగామ బైపాస్ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి వాహనదారులకు నరకప్రాయంగా మారిందని గజ్వేల్ మండల బీజేపీ అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతిరోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ కీలక రహదారిపై పెద్దఎత్తున గుంతలు ఏర్పడటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రయాణికులు తీవ్ర భయాందోళనల మధ్య ప్రయాణించాల్సి వస్తోందని తెలిపారు. రహదారి దుస్థితిపై గతంలో పలు వార్తాపత్రికల్లో కథనాలు ప్రచురితమైనప్పటికీ సంబంధిత అధికారులు, పాలకులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి జాలిగామ బైపాస్ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలని అశోక్ గౌడ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల తరఫున బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో దాతర్‌పల్లి సర్పంచ్ రాజు, మండల ప్రధాన కార్యదర్శులు ఇప్ప స్వామి, బార్ అరవింద్, మండల ఉపాధ్యక్షులు శాతం స్వామి, మండల సీనియర్ నాయకులు కర్నాలు శ్రీనివాస్, గణపతి, మహేష్ చారి, నరేష్, బీజేవైఎం నాయకులు అనిల్, సోషల్ మీడియా కన్వీనర్ జీడిపల్లి మధు కర్ణాకర్, మహేందర్, గణేష్, కుమార్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీలకు డా. అంబేద్కర్ వైద్య సహాయ పథకం ద్వారా వైద్యం

**జిల్లా కలెక్టర్ మను చౌదరి**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యొక్క భావజాలం తత్వాన్ని ప్రచారం చేయడం, అలాగే డాక్టర్ అంబేద్కర్ జన్మ శతాబ్ది ఉత్సవాల కమిటీ సిఫార్సుల నుండి ఉద్భవించిన కీలక సంక్షేమ పథకాలను నిర్వహించడం లక్ష్యంగా ఏర్పాటైన డాక్టర్ అంబేద్కర్ ఫౌండేషన్ భారత ప్రభుత్వ సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్థాపించబడిన స్వయంప్రతిపత్తి గల సంస్థ "డాక్టర్ అంబేద్కర్ వైద్య సహాయ పథకాన్ని" అమలు చేస్తోందని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పథకం, అవయవ మార్పిడి, వెన్నెముక శస్త్రచికిత్సలు, కిడ్నీ, క్యాన్సర్, మెదడు సంబంధిత వ్యాధులతో సహా తీవ్రమైన ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న షెడ్యూల్డ్ కుల షెడ్యూల్డ్ తెగ వర్గాలకు చెందిన రోగులకు కీలకమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని పేర్కొన్నారు.వీరి వార్షిక కుటుంబ ఆదాయం ఐదు లక్షల రూపాయలు మాత్రమే కంటే తక్కువగా ఉండాలని, వ్యాధుల వారీగా గరిష్ట పరిమితి మొత్తం వివరాలను జిల్లా కలెక్టర్ మను చౌదరి వివరించారు.

**ఇతర ప్రాణాంతక వ్యాధులు గరిష్ట పరిమితి**

**రూ. 2.00 లక్షలు చెల్లిస్తారని పేర్కొన్నారు.**

ఈ సంక్షేమ పథకం యొక్క పరిధిని, ప్రభావాన్ని విస్తృతం చేయడానికి, "డాక్టర్ అంబేద్కర్ వైద్య సహాయ పథకం"ను 2026లో సమగ్రంగా సవరించడం జరిగిందని, ఈ సవరణలు అర్హత గల వ్యాధుల పరిధిని ఎంప్యానెల్డ్ ఆసుపత్రులను విస్తరిస్తాయని అర్హులైన అభ్యర్థులు పోస్ట్ ద్వారా వైద్య సహాయం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తులను నిర్దేశించిన దరఖాస్తు ఫార్మాట్‌లో (ముద్రిత రూపంలో గానీ లేదా నిర్దేశించిన ప్రోఫార్మా ప్రకారం సాదా కాగితంపై ముసాయిదా రూపంలో గానీ) సమర్పించాలని కోరారు, దరఖాస్తు మార్గదర్శకాలు, ఫారమ్‌లు మరిన్ని వివరా

# గజ్వేల్ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా ఆషాఢం గోరింటాకు సంబరాలు ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థినీలు

**గోరింటాకు ఆరోగ్య, ఆయుర్వేద ప్రయోజనాలపై అవగాహన**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని గోరింటాకు సంబరాలను ఘనంగా నిర్వహించారు. కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినీలు ఉత్సాహంగా పాల్గొని ఒకరికొకరు గోరింటాకు పెట్టుకున్నారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం మాట్లాడుతూ ఆషాఢమాసంలో గోరింటాకు పెట్టుకోవడం వల్ల పలు శాస్త్రీయ, ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. వర్షాకాలంలో వచ్చే కొన్ని సీజనల్, చర్మ సంబంధిత సమస్యల నివారణకు గోరింటాకు ఆయుర్వేద పరంగా ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ డి. సుజాత మాట్లాడుతూ గోరింటాకు వైద్యపరమైన ప్రయోజనాలతో పాటు తెలుగు సంస్కృతిలోనూ ప్రత్యేక స్థానం కలిగి ఉందన్నారు. మహిళలు, చిన్నారులు ఒకచోట చేరి గోరింటాకు పెట్టుకోవడం తెలుగు రాష్ట్రాల్లో అనాదిగా వస్తున్న సంప్రదాయమని తెలిపారు.గోరింటాకు కాళ్ల పగుళ్లు, గోళ్ల ఆరోగ్యం, శిరోజాల ఆరోగ్యం, తలనొప్పి వంటి సమస్యలకు ఆయుర్వేద పరంగా ఉపయోగపడుతుందని ఆమె వివరించారు.కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కన్వీనర్ శ్రీమతి ఎం.ఎం. లక్ష్మి, సీనియర్ అధ్యాపకులు శ్రీమతి శ్రీలత, డాక్టర్ సరోజ, శ్రీమతి కస్తూరిబాయ్, డాక్టర్ సి.హెచ్. శోభారాణి, శ్రీమతి జె.వి.ఆర్. అర్చన, శ్రీమతి సి.హెచ్. ఉమారాణి, శ్రీమతి సరోజన, డాక్టర్ జ్యోతి, శ్రీమతి శృతి, అధ్యాపకులు డాక్టర్ బి. మురళీధర్, డాక్టర్ ఎ. బాలచంద్రం, కళాశాల కార్యాలయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థినీలు పాల్గొన్నారు.

# మానవత్వానికి చేయూత

**గాడిపల్లి అనూప్ జన్మదిన వేడుకల సందర్భంగా**

**అనాథ కుటుంబానికి ఆర్థిక సహాయం**

**మాతా శిశు సంరక్షణ కేంద్రంలో రోగుల**

**కుటుంబ సభ్యులకు అల్పాహారం**

**బాలింతలు, గర్భిణీలు, పేషెంట్లకు పండ్లు, బ్రెడ్ పంపిణీ**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )మానవత్వమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ గాడిపల్లి అనూప్ తన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలో మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ తనయుడు, సిద్దిపేట జిల్లా పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు గాడిపల్లి అనూప్ జన్మదిన వేడుకలను పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.
ముందుగా మహంకాళి దేవాలయంలో వేద బ్రాహ్మణుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పద్మశాలి కులదైవమైన మార్కండేయ దేవాలయంలో ఐదుగురు బ్రాహ్మణోత్తములతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. సీతారామ ఉమామహేశ్వరి దేవాలయంలో స్వామివారిని దర్శించుకున్నారు.అనంతరం గజ్వేల్ మాతా శిశు సంరక్షణ కేంద్రంలో రోగుల కుటుంబ సభ్యులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. చికిత్స పొందుతున్న బాలింతలు, గర్భిణీలు, పేషెంట్లు కలిపి సుమారు 55 మందికి పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.

**నిరుపేద కుటుంబానికి అండగా..**

కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన నిరుపేద పద్మశాలి కుటుంబానికి అండగా నిలుస్తామని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పద్మశాలి సేవా సంఘం ఇచ్చిన హామీ మేరకు గాడిపల్లి అనూప్ జన్మదిన సందర్భంగా ఆ కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకుని, నిత్యావసర వస్తువులతో పాటు అత్యవసర అవసరాల కోసం రూ.5,000 ఆర్థిక సహాయం అందించారు. భవిష్యత్తులోనూ అవసరమైన సహాయాన్ని అందిస్తామని కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు బోల్లిబత్తుల దేవదాస్, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు స్వర్గం రాజేశం, మాజీ అధ్యక్షుడు దేవులపల్లి రాజారావు, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు తలకొక్కుల ప్రేమ్ కుమార్, మార్కండేయ దేవాలయం అధ్యక్షుడు గడ్డమీద ఆంజనేయులు, పద్మశాలి కుల పెద్దలు ఆడెపు బాలచంద్రం, స్వర్గం చంద్రం, స్వర్గం రాములు, పద్మశాలి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి గాడిపల్లి ఎల్లం రాజు, చేనేత యువజన సంఘం ఉపాధ్యక్షుడు వల్లందాసు సత్యనారాయణ, దేవసాని వాసుదేవ్, నర్సింలు, రాచకొండ మహేష్, చంద్రమౌళి, మంగల్‌పల్లి సత్యనారాయణ, షేర్ల భాస్కర్, నల్ల శివకుమార్, దేవసాని పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# పంద్రాగస్టు కు అన్ని ఏర్పాట్లు చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి**





మేడ్చల్( ప్రశ్న న్యూస్ )స్వాతంత్ర్య దినోత్సవానికి అన్ని ఏర్పాటు చేయాలి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేలో స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల ను ఘనంగా నిర్వహించాలనిమేడ్చల్ -- మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. మంగళ వారం జిల్లా కలెక్టరేట్ లోని విసి హాల్ లో, ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలను కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకను తిలకించేందుకు వచ్చే అధికారులు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సదుపాయాలు కల్పించాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు వచ్చే అతిథికి పోలీస్ గౌరవ వందనంతోపాటు, బందోబస్తుల ఏర్పాట్లను చూడాలని పోలీసు శాఖ అధికారులను ఆదేశించారు. వేదిక, కుర్చీలు, బారికేడింగ్ సీటింగ్ వంటి ఏర్పాట్లు ఆర్ అండ్ బి శాఖ, వేదిక వద్దరంగురంగు పూలతో అలంకరణకు ఉద్యానవన శాఖ అధికారులు చూసుకోవాలన్నారు. మైక్ సౌండ్ బాక్సులను ఏర్పాటు చేయాలని ఐఅండ్ పిఆర్ అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్యార్థులచే దేశభక్తి ని పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందచేసేందుకు అన్ని శాఖల అధికారుల వివరాలు సిద్దంగా ఉండేలా చూడాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎలాంటి ఇబ్బందులు, లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మాలతి, కీసర ఆర్డిఓ వెంకట్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముత్తారం గ్రామంలో మలేరియా సర్వే, టీబీ నిర్ధారణ శిబిరం



వెంకటాపురం (ప్రశ్న న్యూస్ )ములుగు జిల్లా వైద్య అధికారి డా. గోపాలరావు, టీబీ ప్రోగ్రాం అధికారి డా. రవితేజ ఆదేశాల మేరకు అలుబాక గ్రామపంచాయతీ పరిధిలోని ముత్తారం గ్రామంలో మంగళవారం ఇంటింటి మలేరియా సర్వే నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పూజారి ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది రక్తపూత నమూనాలు సేకరించి, ఆర్‌డీటీ ద్వారా మలేరియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అలాగే డ్రై డే కార్యక్రమాన్ని చేపట్టి గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అప్రమత్తత, నీటిని కాచి చల్లార్చి తాగడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు ముత్తారం గ్రామంలో జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా టీబీ స్క్రీనింగ్, ఆరోగ్య శిబిరం నిర్వహించారు. రెండు వారాలకు మించి దగ్గు, రాత్రిపూట జ్వరం, తేమడ లో రక్తం పడటం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉన్నవారికి ఎక్స్‌రే స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 62 మందికి హెల్త్ చెకప్, 72 మందికి ఎక్స్‌రే స్క్రీనింగ్ నిర్వహించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పూజారి ఆదిలక్ష్మి, హెచ్‌ఈఓ కోటిరెడ్డి, ఎస్‌టీఎస్ వెంకటేశ్వరరావు, ఏఎన్‌ఎంలు ధనలక్ష్మి, వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్లు మోహన్ కృష్ణ, చిన్న వెంకటేష్, టీబీ అలెర్ట్ ఇండియా కోఆర్డినేటర్ రాజు, ఎక్స్‌రే టెక్నీషియన్ సంతోష్, కమ్యూనిటీ మొబిలైజర్ విజయ్ కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆగస్టు 24న ఆదివాసీ ర్యాలీ.

**అర శతాబ్దంగా రిజర్వేషన్లు కొల్లగొడుతున్నారు - తుడుం దెబ్బ.**

**ఏజెన్సీ ఉద్యోగాల్లో ఆదివాసీలకే అవకాశం ఇవ్వాలి.**

**ఆగస్టు 24న ఏటూరునాగారానికి ర్యాలీ.**

**ఆదివాసీ హక్కుల కోసం తుడుం దెబ్బ పిలుపు**



ఏటూరునాగారం(ప్రశ్నన్యూస్) 1976 నుండి 2026 వరకు అర శతాబ్దంగా లంబాడీలు ఎస్టీ రిజర్వేషన్లను అక్రమంగా అనుభవిస్తున్నారని, ఆదివాసీల హక్కులను దోచుకుంటున్నారని తుడుం దెబ్బ నాయకులు మండిపడ్డారు.మంగళ వారం జిల్లా అధ్యక్షుడు నల్లబోయిన లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన అత్యవసర సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు మైపతి అరుణ్ కుమార్, జాతీయ ఉపాధ్యక్షులు పోడెం బాబు, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల రవి పాల్గొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 57వ ఉత్తర్వు ప్రకారం 29 శాఖల్లో ఏజెన్సీ ధృవీకరణ పత్రం ఉన్న ఆదివాసీలకే ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా, సాధారణ ప్రకటనలు ఇచ్చి ఐదో షెడ్యూలును ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. పోడు భూములపై అటవీ శాఖ దాడులు చేస్తూ ఆదివాసీలను భయభ్రాంతులకు గురి చేస్తోందన్నారు.ఈ నెల 24వ తేదీ ఆదివారం ఎక్కల వంతెన నుండి ఏటూరునాగారం ఏకీకృత గిరిజన అభివృద్ధి సంస్థ కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ, ముట్టడి.నిర్వహించాలని నిర్ణయించారు. యువకులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఆదివాసీ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి కొరునిబెల్లి గణేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పులుసే బాలకృష్ణ, ఆదివాసీ సేన నాయకులు మడి సాయిబాబా, జిల్లా అధ్యక్షులు దబ్బగట్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త కన్నాలి బీసీ కాలనీలో టీడీపీ ఇంటింటి ప్రచారం



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) తొట్టంబేడు మండలం, శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు, టీడీపీ నాయకుడు రావిళ్ల మునిరాజ నాయుడు ఆధ్వర్యంలో తొట్టంబేడు మండలం పెద్ద కన్నాలి పంచాయతీ పరిధిలోని కొత్త కన్నాలి బీసీ కాలనీలో మంగళవారం ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ప్రతి ఇంటిని సందర్శించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అలాగే స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.ఈ కార్యక్రమంలో ముఖ్య నేతలు గాలి చలపతి నాయుడు, డి. రామ నాయుడు, ప్రతాప్ రెడ్డి, డీసీసీ బ్యాంక్ చైర్మన్ భీమల బాస్కర్, కో-క్లస్టర్ వెంకటాచలం, యూనిట్ ఇన్‌చార్జీలు లెక్కల మురళి నాయుడు, జి. శంకర్ నాయుడు, ఆయకట్టు చైర్మన్ పుల్లూరు సీతారామ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు దండు శంకర్ రెడ్డి, బూత్ ఇన్‌చార్జీలు వేదం వెంకటయ్య, వెంకట సుబ్బయ్య, కన్నాలి దినేష్, కనపర్తి శంకర్ నాయుడు, ఉన్నం ప్రసాద్, భాను ప్రకాష్, గురప్ప, నెలబల్లి సునీల్, కల్లిపూడి సుబ్రహ్మణ్యం, ఓబుల్ రెడ్డి, రామ్మూర్తి, సింగమాల బస్కరయ్య, చికాటి వేణు మొదలగు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు కూడా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# డీఎస్సీపై వైసీపీ దుష్ప్రచారం

## ఫలితాలప్పుడు అభినందనలు.. ఇప్పుడు బోగస్ అంటారా.?

## యువతను తప్పుదోవ పట్టించే కుట్ర: ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు,(ప్రశ్న న్యూస్) మెగా డీఎస్సీపై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని, నిరుద్యోగ యువతను తప్పుదోవ పట్టించేందుకు చేస్తున్న రాజకీయ దుష్ప్రచారమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి విమర్శించారు. డీఎస్సీ ఫలితాలు వెలువడిన సమయంలో అభినందనలు తెలిపిన వైసీపీ నేతలే ఇప్పుడు అదే నియామక ప్రక్రియను బోగస్‌గా చిత్రీకరించడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఆమె మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవతో మెగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది అభ్యర్థుల ఆశలను ప్రభుత్వం నెరవేర్చిందన్నారు.

డీఎస్సీ ఫలితాలు విడుదలైన వెంటనే తెనాలి మాజీ ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు ఉత్తమ ఫలితాలు సాధించారని వైసీపీ నాయకులే సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టి అభినందనలు తెలిపారని గళ్ళా మాధవి పేర్కొన్నారు. అప్పుడు డీఎస్సీ ప్రక్రియపై ఎలాంటి అనుమానాలు వ్యక్తం చేయని వారు ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం అదే ప్రక్రియను బోగస్‌గా పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. తమ పార్టీకి చెందిన వ్యక్తులు ఎంపికైతే గొప్పగా చెప్పుకుని, రాజకీయ పరిస్థితులు మారిన తర్వాత డీఎస్సీపై విమర్శలు చేయడం అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమని ఆమె విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాల విషయంలో మోసం జరిగిందని ఎమ్మెల్యే ఆరోపించారు. డీఎస్సీ నిర్వహణ విషయంలో కాలయాపన తప్ప నిరుద్యోగులకు చేసిందేమీ లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై దృష్టి సారించి మెగా డీఎస్సీని నిర్వహించిందన్నారు. పారదర్శకంగా నియామక ప్రక్రియ చేపట్టి వేలాది మంది యువతకు ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. విద్యారంగ సంస్కరణలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ విషయంలో మంత్రి నారా లోకేశ్ తీసుకుంటున్న చర్యలు రాష్ట్ర విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నాయని గళ్ళా మాధవి పేర్కొన్నారు. నిరుద్యోగ యువత ఆశలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్న అసత్య ప్రచారాన్ని యువత నమ్మబోదని అన్నారు. "యువత భవిష్యత్తుతో



చెలగాటం ఆడొద్దు. నిరుద్యోగుల ఆశలను రాజకీయాలకు ఉపయోగించుకోవడం మానుకోవాలి. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తూ యువతను తప్పుదోవ పట్టించేందుకు చేసే ప్రయత్నాలను వైసీపీ నేతలు విరమించుకోవాలి" అని గళ్ళా మాధవి హితవు పలికారు.

# ప్రతి జిల్లాకూ 'నవోదయ'

### కొత్త జిల్లాల్లోనూ జేఎన్‌వీలు మంజూరు చేయాలి

### కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ఎంపీల వినతి



న్యూఢిల్లీ(ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయాలు (జేఎన్‌వీలు) ఏర్పాటు చేయాలని కోరుతూ రాజ్యసభ సభ్యుడు లింగమనేని రమేశ్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీలు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన జిల్లాలతో పాటు ప్రస్తుతం నవోదయ విద్యాలయాలు లేని అన్ని జిల్లాలకు జేఎన్‌వీలు మంజూరు చేయాలని కోరారు. 2027--28 విద్యా సంవత్సరం నుంచి దశలవారీగా ప్రవేశాలు, విద్యాబోధన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య దూరం

జిల్లాల పునర్వ్యవస్థీకరణతో కొన్ని ప్రాంతాల్లో నవోదయ విద్యాలయాలు అందుబాటులో లేకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన విద్యావకాశాలు దూరమవుతున్నాయని ఎంపీలు కేంద్ర మంత్రికి వివరించారు. ప్రతి జిల్లాలో నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయడం ద్వారా జాతీయ విద్యా విధానం-2020 (ఎన్ఈపీ-2020) లక్ష్యాలతో పాటు వికసిత్ భారత్-2047 లక్ష్యాల సాధనకు మరింత బలం చేకూరుతుందని ఎంపీలు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులకు సమాన విద్యావకాశాలు కల్పించేందుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు నవోదయ విద్యాలయాలను విస్తరించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని వారు కోరారు.

# మారుమూల పల్లెలకు రహదారి బాట

### 158 ఆవాసాలకు తొలిసారి రోడ్డు సౌకర్యం

### రూ.422.10 కోట్లతో 347 కి.మీ. మేర నిర్మాణాలు

### 146 రోడ్లు.. 19 వంతెనలు



అమరావతి(ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని మారుమూల పల్లెలు, ఆవాసాలకు రహదారి సౌకర్యం కల్పించే దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రోడ్డు సౌకర్యం లేని మరో 158 ఆవాసాలకు తొలిసారిగా రహదారులు నిర్మించేందుకు పరిపాలన అనుమతుల ప్రక్రియ పూర్తయింది. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) కింద రూ.422.10 కోట్లతో 347 కిలోమీటర్ల మేర 146 రోడ్లు, 19 వంతెనలు నిర్మించనున్నారు. రాష్ట్రంలోని చిట్టచివరి గ్రామానికీ అభివృద్ధి ఫలాలు చేరాలన్న లక్ష్యంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రూపొందించిన ప్రణాళికలు కార్యరూపం దాల్చుతున్నాయి. ఇప్పటికే 'అడవితల్లి బాట' కార్యక్రమం ద్వారా అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని గిరిశిఖర గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించే చర్యలు చేపట్టారు. తాజాగా మైదాన ప్రాంతాల్లోనూ ప్రధాన రహదారులకు దూరంగా ఉన్న ఆవాసాలను గుర్తించి రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. విద్య.. వైద్యం.. మార్కెట్‌కు చేరువ రహదారి సౌకర్యం లేక ఇన్నాళ్లూ ఇబ్బందులు పడుతున్న గ్రామాలకు కొత్త రోడ్లు, వంతెనల నిర్మాణంతో బాహ్య ప్రపంచంతో అనుసంధానం ఏర్పడనుంది. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు, ప్రజలు వైద్య సేవలు పొందేందుకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. రైతులు తమ పంట ఉత్పత్తులను మార్కెట్లకు తరలించేందుకు కూడా రహదారులు ఎంతో ఉపయోగపడనున్నాయి. మారుమూల గ్రామాల అభివృద్ధికి రహదారులు కీలకమని, రోడ్డు సౌకర్యంతో ఆయా ప్రాంతాల్లో జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అధికారులు పేర్కొన్నారు. నిర్మాణ పనుల పర్యవేక్షణలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# ఆమ్రపాలికి 'పోస్టింగ్' పజిల్

## టూరిజం పగ్గాలు తప్పించి..జీఏడీకి రిపోర్టింగ్

## సొంత రాష్ట్రంలోనే కీలక అధికారి తదుపరి అడుగు ఏమిటి.?



అమరావతి,(ప్రశ్న న్యూస్) తెలంగాణలో తనదైన ముద్ర వేసుకున్న యువ ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి కాటా.. సొంత రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెట్టిన రెండేళ్లలోనే మరోసారి వార్తల్లో నిలిచారు. ఒకప్పుడు తెలంగాణలో కీలక బాధ్యతలు నిర్వహించి పరిపాలనా వర్గాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆమెకు.. తాజాగా ఏపీ ప్రభుత్వం టూరిజం శాఖ నుంచి ఉద్వాసన పలికింది. అయితే అక్కడితో ఆగకుండా తదుపరి పోస్టింగ్ ఇవ్వకుండా సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)కు రిపోర్టు చేయాలని ఆదేశించడం ఇప్పుడు అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆమ్రపాలి 2010 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి. రాష్ట్ర విభజన సమయంలో కేడర్ కేటాయింపు అంశం చుట్టూ ఆమె సర్వీసు ప్రయాణంలో న్యాయపరమైన పరిణామాలు చోటుచేసుకున్నాయి. అనంతరం తెలంగాణలో పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో ఆమె పేరు విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. పరిపాలనలో వేగం, అధికార యంత్రాంగంపై పట్టుతో పాటు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టే అధికారిణిగా గుర్తింపు పొందారు. అయితే కేడర్ వ్యవహారంలో చోటుచేసుకున్న పరిణామాల అనంతరం ఆమ్రపాలి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చారు. 2024 అక్టోబరులో ఆమెను ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా నియమించడంతో పాటు ఏపీ టూరిజం అథారిటీ సీఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

### సొంత గడ్డపై.. టూరిజం బాధ్యతలు..

ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని కొత్త పుంతలు తొక్కించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆమెకు కీలక బాధ్యతలు అప్పగించింది. రాష్ట్రంలో బీచ్ టూరిజం, ఆధ్యాత్మిక పర్యాటకం, ఎకో టూరిజం, వారసత్వ పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి విస్తృత అవకాశాలున్న నేపథ్యంలో ఆమ్రపాలి నియామకం అప్పట్లో ప్రాధాన్యం సంతరించుకుంది. కానీ తాజాగా జరిగిన భారీ ఐఏఎస్ బదిలీల్లో సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ఆమ్రపాలి నుంచి ఏపీటీడీసీ ఎండీ బాధ్యతలను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఆమెను తదుపరి పోస్టింగ్ కోసం జీఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశించింది. మరోవైపు ఏపీటీడీసీ ఎండీగా రవి సుభాష్‌కు బాధ్యతలు అప్పగించింది.

### పోస్టింగ్ ఎందుకు లేదు.?

### ఇదే ఇప్పుడు అసలు ప్రశ్న.

సాధారణంగా సీనియర్ ఐఏఎస్ అధికారుల బదిలీల సమయంలో ఒక బాధ్యత నుంచి మరో కీలక బాధ్యతకు నియమిస్తూ ఉత్తర్వులు వెలువడుతుంటాయి. అయితే ఆమ్రపాలిని మాత్రం ప్రస్తుత బాధ్యతల నుంచి తప్పించి 'జీఏడీకి రిపోర్టు చేయాలి. తదుపరి పోస్టింగ్ కోసం వేచి ఉండాలి' అనే విధంగా ఆదేశించడం అధికార వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో పలు శాఖలలో పనిచేసిన ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేదని విధుల పట్ల నిర్లక్ష్యం వహించిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక జిహెచ్ఎంసి కమిషనర్ గా పూర్తిగా విఫలం చెందారన్న విమర్శలు లేకపోలేదు.

అయితే దీనికి ప్రభుత్వం అధికారికంగా ఏదైనా కారణం ప్రకటించిందా.? పరిపాలనా అవసరాలే కారణమా.? కేడర్ సంబంధిత పరిణామాల ప్రభావమా.? లేక త్వరలోనే మరో కీలక బాధ్యత అప్పగించనున్నారా.? అన్నది స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికైతే దీనిని ఏదైనా వివాదానికి ముడిపెట్టి నిర్ణయానికి రావడం సరికాదు. అధికారిక ఉత్తర్వుల్లో పేర్కొన్న మేరకు ఆమెను జీఏడీకి రిపోర్టు చేయమని మాత్రమే ఆదేశించారు. తదుపరి పోస్టింగ్ ప్రభుత్వం నిర్ణయించాల్సి ఉంది.

### తెలంగాణ నుంచి ఏపీకి.. మళ్లీ ఎక్కడికి.?

ఆమ్రపాలి సర్వీసు ప్రయాణంలో తెలంగాణ కీలక అధ్యాయం. విభజన అనంతరం కేడర్ కేటాయింపు అంశం చుట్టూ న్యాయపరమైన పరిణామాలు చోటుచేసుకున్నాయి. తెలంగాణ హైకోర్టు పరిధిలో జరిగిన న్యాయ ప్రక్రియ అనంతరం ఆమె ఏపీ కేడర్‌లో సేవలందిస్తున్నారు. ఇప్పుడు ఏపీలోనూ కీలకమైన టూరిజం బాధ్యతల నుంచి తప్పించడంతో ఆమె తదుపరి రాజకీయ-పరిపాలనా ప్రయాణంపై ఆసక్తి నెలకొంది.

### ఆమ్రపాలి తదుపరి అడుగు ఏంటి.?

### జీఏడీ నుంచి ఆమ్రపాలికి ఏ శాఖ?

పరిపాలనలో అనుభవం ఉన్న అధికారిణిగా ఆమెకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక బాధ్యత అప్పగించే అవకాశం ఉందా.? లేక కొంతకాలం జీఏడీలోనే ఉంచి అనంతరం పోస్టింగ్ ఇస్తుందా.? అన్నది వేచి చూడాలి. మరోవైపు పర్యాటక శాఖలోనూ భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. ఎస్.ఎస్. రావత్‌కు పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించగా, రవి సుభాష్ ఏపీటీడీసీ ఎండీగా బాధ్యతలు చేపట్టనున్నారు. దీంతో టూరిజం శాఖలో కొత్త పరిపాలనా బృందం రంగంలోకి వచ్చినట్టయింది.

### ఆమ్రపాలి ఎక్కడ.? అధికార వర్గాల్లో ఇదే చర్చ

తెలంగాణలో పనిచేసిన సమయంలో కేవలం వరంగల్ లో మాత్రమే గుర్తింపు తెచ్చుకున్న ఆమ్రపాలి తరువాత ఇతర శాఖలు నిర్వహించడంలో పూర్తిగా విఫలం చెందిన విమర్శలు ఉన్నాయి. హైదరాబాద్ జిహెచ్ఎంసి కమిషనర్ గా ఉండి నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఇక సొంత రాష్ట్రం ఏపీలోనూ కీలక బాధ్యతలు చేపట్టడం అప్పట్లో ఆసక్తి రేపింది. ఇప్పుడు అదే అధికారిణికి తదుపరి పోస్టింగ్ ఇవ్వకుండా జీఏడీకి రిపోర్టింగ్ ఆదేశాలు రావడంతో మరోసారి చర్చ మొదలైంది. అయితే ఇది తాత్కాలిక పరిపాలనా మార్పా.? లేక భవిష్యత్‌లో మరింత కీలక బాధ్యతకు ముందు తీసుకున్న నిర్ణయమా.? అన్నది ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులతోనే తేలనుంది. టూరిజం పగ్గాలు పోయాయి. జీఏడీకి రిపోర్టింగ్ వచ్చింది. కానీ ఆమ్రపాలి తదుపరి పోస్టింగ్ ఎక్కడ.? ఈ ప్రశ్నకు సమాధానం కోసం ఇప్పుడు అధికార యంత్రాంగమే కాదు. రాజకీయ వర్గాలు, ప్రజలు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# హామీలు మరిచి పాలన సాగిస్తే ప్రజలు సహకరించరు

### ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజకీయ మార్పు అవసరం

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



జూలూరుపాడు( ప్రశ్న న్యూస్)ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి పాలన సాగిస్తే ప్రజల నుంచి సహకారం ఉండదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు దేశంలో సామాజిక, రాజకీయ మార్పు అవసరమని పేర్కొన్నారు. సీపీఐ చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర మంగళవారం జూలూరుపాడు చేరుకుంది. పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికి ప్రధాన రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభలో కూనంనేని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా మత విద్వేషాలను రెచ్చగొడుతోందని విమర్శించారు. యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పన వంటి హామీలను విస్మరించిందని ఆరోపించారు. నీట్ వ్యవహారంతో విద్యార్థులు, యువతలో ఆందోళన నెలకొందన్నారు. దేశ సంపద కొంతమంది కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకు ఉపయోగపడేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాడుతుందని, ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే షాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, పుల్లారెడ్డి, కొత్తగూడెం మేయర్ మూడు గణేష్, జిల్లా నాయకులు చంద్ర నరేంద్రకుమార్, నరాటి ప్రసాద్, చంద్రగిరి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, భూక్య శ్రీనివాస్, ఎస్‌కే ఫయాం, సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కీసర పోస్టాఫీసులో ఖాతాదారులకు ఉచితంగా త్రివర్ణ పతాకాల పంపిణీ

### దేశభక్తి స్ఫూర్తితో కార్యక్రమం

### ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలనే ఉద్దేశం

### దాత బిజెపి కీసర మండల ప్రధాన కార్యదర్శి నల్ల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో త్రివర్ణ పతాకాల పంపిణీ




కీసర( ప్రశ్న న్యూస్) కీసర సబ్ పోస్టాఫీసు ఖాతాదారులకు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసేందుకు ఉచితంగా త్రివర్ణ పతాకాలను పంపిణీ చేస్తున్నట్లు సబ్ పోస్ట్‌మాస్టర్ ఎస్. భాస్కర్ తెలిపారు. కీసరకు చెందిన దాత నల్ల వెంకట్ రెడ్డి ఈ త్రివర్ణ పతాకాలను అందజేశారు. ప్రజల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు, ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలనే స్ఫూర్తిని కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా పోస్టాఫీసు ద్వారా అందుబాటులో ఉన్న వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పొదుపు పథకాలు, ఇతర పోస్టల్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నట్లు భాస్కర్ పేర్కొన్నారు. పోస్టాఫీసు ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఇళ్లపై జాతీయ జెండాను గౌరవంగా ఎగురవేయాలని బిజెపి కీసర మండల ప్రధాన కార్యదర్శి నల్ల వెంకటరెడ్డి కోరారు.

# గజ్వేల్‌పై కల్వకుంట్ల కవిత ప్రత్యేక దృష్టి

### వారం రోజుల్లో తెలంగాణ రక్షణ సేన మండల కమిటీలు పూర్తి

### బడుగు వర్గాలు, ఉద్యమకారులకు ప్రాధాన్యత

### రాష్ట్ర ఉపాధ్యక్షులు, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్టాల యాదగిరి ముదిరాజ్



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )సామాజిక తెలంగాణ సాధన లక్ష్యంగా ఏర్పాటైన తెలంగాణ రక్షణ సేన మండల కమిటీలను వారం రోజుల్లో పూర్తి చేయనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్టాల యాదగిరి ముదిరాజ్ తెలిపారు. మంగళవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కమిటీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు తెలంగాణ ఉద్యమకారులకు ప్రాధాన్యత కల్పిస్తామని ఆయన వెల్లడించారు. ముఖ్యంగా రెండున్నర దశాబ్దాలుగా గజ్వేల్ నియోజకవర్గంలో పార్టీ కోసం, ఉద్యమం కోసం పనిచేసిన ఉద్యమకారులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా రాజకీయ పార్టీలు ఉన్నత వర్గాలకు పెద్దపీట వేస్తూ బడుగు, బలహీన వర్గాలను అణచివేస్తున్నాయని ఆరోపించారు. వెనుకబడిన వర్గాలు ఇప్పటికైనా ఆయా పార్టీల వైఖరిని అర్థం చేసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో తమకు న్యాయం జరగదనే విషయాన్ని వెనుకబడిన వర్గాలు గుర్తించి తమతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామని తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గజ్వేల్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని కొట్టాల యాదగిరి ముదిరాజ్ తెలిపారు. పార్టీ బలోపేతం కోసం అన్ని వర్గాలను కలుపుకొని శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు.

# మాటల యుద్ధానికి అధిష్ఠానం బ్రేక్.?

**బాలినేని--దామచర్లకు ఫోన్ కాల్స్**

**మీడియా ముందుకు రావొద్దంటూ సూచనల.?**



ఒంగోలు(ప్రశ్న న్యూస్) కూటమి రాజకీయాల్లో మరోసారి అంతర్గత విభేదాల వేడి రాజుకున్న నేపథ్యంలో అధిష్ఠానం స్థాయిలో జోక్యం మొదలైందన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. టీడీపీ, జనసేనకు చెందిన ముఖ్య నేతలు బాలినేని శ్రీనివాసరెడ్డి, దామచర్ల జనార్ధన్ మధ్య చోటుచేసుకుంటున్న మాటల యుద్ధానికి తాత్కాలికంగా తెరదించేందుకు ఇరు పార్టీల అగ్రనేతలు రంగంలోకి దిగినట్లు సమాచారం. ఇద్దరు నేతలకు ఫోన్ చేసి ప్రస్తుతం మీడియా సమావేశాలు, బహిరంగ విమర్శలకు దూరంగా ఉండాలని సూచించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇటీవల బాలినేని శ్రీనివాసరెడ్డి, దామచర్ల జనార్ధన్ వర్గాల మధ్య రాజకీయ వ్యాఖ్యలు, ప్రతివిమర్శలు చోటుచేసుకోవడం కూటమి వర్గాల్లో చర్చకు దారితీసింది. ఒకరి వ్యాఖ్యలకు మరొకరు స్పందించడం.. ఆ తర్వాత ఆ వ్యాఖ్యలు రాజకీయ చర్చకు కేంద్రంగా మారడం వరుసగా జరుగుతున్న పరిణామాలుగా నేతలు పేర్కొంటున్నారు.
ఇలాంటి పరిస్థితుల్లో వివాదం మరింత ముదరకముందే పార్టీ అధిష్ఠానాలు జోక్యం చేసుకోవడం ద్వారా పరిస్థితిని అదుపులోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు సమాచారం.

### మీడియా ముందుకు రావొద్దంటూ?

ఇద్దరు నేతలకు ఫోన్ చేసిన పార్టీ పెద్దలు ప్రస్తుతం ఎలాంటి మీడియా సమావేశాలు నిర్వహించకుండా, బహిరంగంగా పరస్పర విమర్శలు చేసుకోకుండా ఉండాలని సూచించినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కూటమి భాగస్వాములుగా సమన్వయంతో పనిచేయాలని, ఏవైనా సమస్యలు ఉంటే పార్టీ అంతర్గతంగా చర్చించుకుని పరిష్కరించుకోవాలని సూచించినట్లు తెలుస్తోంది.

# విద్యార్థుల భవిష్యత్తుకు దాతృత్వం అండ

**కాచవరం పాఠశాల విద్యార్థులకు రాత పుస్తకాల పంపిణీ**




ఇబ్రహీంపట్నం (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలం కాచవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు రాత పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.పాఠశాల విద్యా కుటుంబం తరఫున చేసిన విజ్ఞప్తికి స్పందించిన కేతనకొండకు చెందిన గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ డాక్టర్ మొగులూరు ఎలీషా విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరానికి అవసరమైన రాత పుస్తకాలను అందజేశారు. తెలుగు, ఆంగ్లం, కాపీ రైటింగ్, ఎక్కాల పుస్తకాలు తదితరాలను సుమారు రూ.10 వేల విలువైన వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. దాతృత్వంతో విద్యార్థులకు అండగా నిలిచిన ఎలీషాకు పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

### ఏడేళ్లుగా ఆత్మీయ అనుబంధం

ఈ సందర్భంగా ఉర్దూ ఉపాధ్యాయుడు మొహమ్మద్ ఇర్ఫాన్ పాషా మాట్లాడుతూ.. గత ఏడేళ్లుగా డాక్టర్ మొగులూరు ఎలీషా పాఠశాలకు ఆత్మీయ దాతగా అండగా నిలుస్తున్నారని తెలిపారు. పాఠశాలకు విద్యాపరంగా ఏ అవసరం ఉన్నా తన దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే స్పందించి సహాయం అందిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాస్టర్ పాల్ అనిల్, తల్లిదండ్రులు రామారావు, నగీన, రంజాన్ బీ, ఖాసీం బీ తదితరులు పాల్గొన్నారు.

# సహకార స్టోర్లో 'జలగలు'

**వీటీపీఎస్ కో-ఆపరేటివ్ సొసైటీలో అక్రమాలపై ఆరోపణలు**

**ఫిర్యాదులు వచ్చినా చర్యలేవీ.? పాలకవర్గం తీరుపై అనుమానాలు**




ఇబ్రహీంపట్నం(ప్రశ్న న్యూస్) వీటీపీఎస్ కో-ఆపరేటివ్ సొసైటీ స్టోర్స్ వ్యవహారాల్లో కొందరి తీరుపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్టోర్స్‌కు వచ్చే వ్యాపారాన్ని దెబ్బతీయడం, సరుకుల విక్రయాల్లో జోక్యం చేసుకోవడం, స్టోర్స్ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు నూతన పాలకవర్గం దృష్టికి వెళ్లినట్లు సమాచారం. అయితే ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడంపై ఉద్యోగులు, సభ్యుల్లో చర్చ జరుగుతోంది.

### 10 కేజీల జీడిపప్పు కోసం వెళితే...

ఇటీవల ఓ ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా సుమారు 10 కేజీల జీడిపప్పు అవసరం కావడంతో వీటీపీఎస్ కో-ఆపరేటివ్ స్టోర్స్‌ను సంప్రదించినట్లు సమాచారం. అయితే అక్కడ పనిచేస్తున్న ఓ వ్యక్తి స్టోర్స్‌లో లభించే జీడిపప్పు నాణ్యత, పరిమాణంపై ప్రతికూలంగా మాట్లాడి విజయవాడ లేదా కొండపల్లిలో కొనుగోలు చేసుకోవాలని సూచించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.దీంతో స్టోర్స్‌కు రావాల్సిన వ్యాపారాన్ని ఉద్దేశపూర్వకంగా ఇతర ప్రాంతాలకు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై పాలకవర్గానికి మౌఖికంగా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

### రాతపూర్వక ఫిర్యాదు చేసినా...

ఇదే వ్యవహారంపై సహాయక సిబ్బందిలో కొందరు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయినప్పటికీ సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకోకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫిర్యాదులపై వాస్తవాలను నిర్ధారించేందుకు విచారణ చేపట్టారా? విచారణ జరిగితే ఏం తేలింది? బాధ్యులపై చర్యలు ఎందుకు తీసుకోలేదు? అన్నది స్పష్టం కావాల్సి ఉంది.ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. అవి అసత్యమైతే విచారణ ద్వారా నిజానిజాలను వెల్లడించి అనుమానాలకు తెరదించాల్సిన బాధ్యత పాలకవర్గంపై ఉంది. ఇప్పటికైనా సమగ్ర విచారణకు ఆదేశించి సహకార స్టోర్స్ వ్యవహారాలను పారదర్శకంగా నిర్వహించాలని సభ్యులు కోరుతున్నారు.

# శుభ్రత అవార్డులు.. వీధుల్లో చెత్త కుప్పలు

- తాడేపల్లి కొత్తూరులో కానరాని పారిశుద్ధ్యం
- పశువుల ఆస్పత్రి రోడ్డు చెత్తమయంగా మారినా పట్టించుకోని అధికారులు
- పూడికతో నిండిన డ్రైనేజీలు.. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్త కొండ
- ఫొటోలకు.. ఫైళ్లకే పరిమితమా శుభ్రత.? ప్రజల ఆరోగ్యంతో చెలగాటమా.?





మంగళగిరి(ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోనే శుభ్రతలో అగ్రస్థానంలో ఉన్నామని చెప్పుకుంటున్న మంగళగిరి నియోజకవర్గంలో పారిశుద్ధ్య పరిస్థితులకు భిన్నమైన దృశ్యాలు దర్శనమిస్తున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాడేపల్లి కొత్తూరులోని పశువుల ఆస్పత్రి రోడ్డు చెత్తాచెదారంతో నిండిపోయి దుర్గంధభరితంగా మారిందని ఆరోపిస్తున్నారు. నిత్యం వందలాది వాహనాలు, వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగించే ప్రధాన మార్గం పట్ల కార్పొరేషన్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడుతున్నారు.
ఒకవైపు పారిశుద్ధ్యంపై అవార్డులు.. మరోవైపు ప్రధాన రహదారుల వెంబడి చెత్తకుప్పలు. అధికారులు చెబుతున్న శుభ్రతకు, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పరిస్థితులకు పొంతన లేకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

### చెత్తతో కంపుకొడుతున్న రహదారి

తాడేపల్లి కొత్తూరులోని పశువుల ఆస్పత్రి రోడ్డు పక్కన ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థాలు, చెత్తాచెదారం పేరుకుపోయిందని స్థానికులు చెబుతున్నారు. ఎక్కడికక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తుండటంతో రహదారిపై నడిచే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటున్నారు. చెత్త కుళ్లిపోవడంతో దుర్వాసన వస్తోందని, ఉదయం, సాయంత్రం వేళల్లో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటోందని వాపోతున్నారు.రోడ్డు పక్కనే పూడికతో డ్రైనేజీలు నిండిపోయి మురుగునీరు సరిగా ప్రవహించని పరిస్థితి నెలకొందని స్థానికుల ఆరోపణ. వర్షం పడినప్పుడు పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని చెబుతున్నారు. మురుగు, చెత్త కలిసిపోయి దోమలు, ఈగలు పెరిగేందుకు అనుకూల వాతావరణం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్త కొండ!

ప్రజలకు అత్యంత ప్రమాదకరంగా మారే మరో అంశాన్ని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. రహదారి పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టుపక్కల కూడా చెత్త పేరుకుపోయిందని చెబుతున్నారు. క్రమంగా చెత్త కుప్ప పెద్దదిగా మారుతోందని, విద్యుత్ పరికరాల సమీపంలో ఇలాంటి పరిస్థితి ఉండటం ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
చెత్త తొలగించడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఎండాకాలంలో ఎండిన చెత్తకు అగ్ని ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

### రెండు.. మూడు నెలలకు ఓసారి ట్రాక్టరా?

పారిశుద్ధ్య నిర్వహణ నిరంతర ప్రక్రియగా ఉండాల్సిన ప్రాంతంలో అప్పుడప్పుడు చెత్తను తొలగించి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండు, మూడు నెలలకు ఒకసారి ట్రాక్టర్‌ను పంపించి చెత్తను తరలిస్తున్నారని, అనంతరం మళ్లీ అదే పరిస్థితి పునరావృతమవుతోందని స్థానికులు చెబుతున్నారు.
"చెత్త తొలగించాం" అని రికార్డుల్లో చూపించడం తప్ప.. సమస్యకు శాశ్వత పరిష్కారం ఎందుకు చూపడం లేదు? అని ప్రశ్నిస్తున్నారు. చెత్త పేరుకుపోకుండా ఇంటింటి చెత్త సేకరణను పటిష్ఠం చేయడంతో పాటు, చెత్తను రోడ్డు పక్కన వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### ప్రజల ఫిర్యాదులకు విలువ లేదా?

ఈ సమస్యపై స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెబుతున్నారు. చెత్త తొలగించాలని, డ్రైనేజీలను శుభ్రం చేయాలని, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని కోరినా తాత్కాలిక చర్యలకే అధికారులు పరిమితమవుతున్నారని ఆరోపిస్తున్నారు.
ప్రజలు ఫిర్యాదు చేసిన తర్వాతే అధికారులు స్పందిస్తారా? పారిశుద్ధ్య సిబ్బంది క్రమం తప్పకుండా ప్రాంతాన్ని పరిశీలించరా? సమస్యను గుర్తించడానికి ప్రజలే అధికారులకు చెప్పాలా? అన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.

### శుభ్రత అవార్డులు.. ఫొటోలకేనా?

పట్టణాలు, గ్రామాల్లో పారిశుద్ధ్య ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్న సమయంలో తాడేపల్లి కొత్తూరులోని పరిస్థితులు అధికారుల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని స్థానికులు అంటున్నారు.
శుభ్రతకు అవార్డులు తీసుకుంటున్న అధికారులు.. క్షేత్రస్థాయిలోని చెత్తకుప్పలను ఎందుకు చూడటం లేదు?
పారిశుద్ధ్య కార్యక్రమాలు ఫొటోలు, రికార్డులకే పరిమితమవుతున్నాయా?
ప్రజలు నివసించే ప్రాంతాల్లో నిరంతర పారిశుద్ధ్య పర్యవేక్షణ ఎందుకు కనిపించడం లేదు?

### అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

అవార్డులు రావడం మాత్రమే కాకుండా ప్రజలు నివసించే ప్రతి ప్రాంతంలో పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడితేనే వాటికి సార్థకత ఉంటుందని పేర్కొంటున్నారు.

### ఆరోగ్యంపై ప్రభావం పడుతోందంటున్న స్థానికులు

చెత్త కుప్పలు, నిల్వ మురుగునీరు, దోమల సమస్య కారణంగా స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. కొందరు జ్వరాలు, చర్మ సంబంధిత సమస్యలు, దోమల బాధలు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే వీటికి ఈ ప్రాంతంలోని పారిశుద్ధ్య లోపాలే కారణమని వైద్యపరంగా నిర్ధారణ కావాల్సి ఉంది.
అయితే ముందస్తు జాగ్రత్తగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. దోమల నివారణ చర్యలు చేపట్టడంతో పాటు, డ్రైనేజీల్లో పూడిక తొలగించి మురుగునీటి ప్రవాహాన్ని మెరుగుపరచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### కార్పొరేషన్ అధికారులు స్పందించాలి

తాడేపల్లి కొత్తూరు పశువుల ఆస్పత్రి రోడ్డు సమస్య కేవలం ఒక ప్రాంతానికి సంబంధించిన పారిశుద్ధ్య సమస్యగా కాకుండా ప్రజల ఆరోగ్యం, భద్రత, పర్యావరణానికి సంబంధించిన అంశంగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు.
చెత్త కుప్పలను తొలగించడం, డ్రైనేజీల్లో పూడిక తీయడం, ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాలను శుభ్రం చేయడం, క్రమం తప్పకుండా చెత్త సేకరణ చేపట్టడం వంటి చర్యలను తక్షణమే చేపట్టాలని కోరుతున్నారు. అదే సమయంలో చెత్తను రోడ్డు పక్కన పడేసే వారిపై కూడా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.అవార్డులు.. ప్రచారాలు..
ఫొటోలు ఒకవైపు. ప్రజలు నివసించే వీధుల్లో కనిపించే పారిశుద్ధ్య పరిస్థితులు మరోవైపు. ఈ రెండింటిలో ఏది నిజమైన శుభ్రత? అన్న ప్రశ్న ఇప్పుడు తాడేపల్లి కొత్తూరులో చర్చనీయాంశంగా మారింది.ప్రజలు పలుమార్లు మొరపెట్టుకున్నా సమస్య పరిష్కారం కాకపోతే పారిశుద్ధ్య వ్యవస్థపై నమ్మకం ఎలా కలుగుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.
ఇకనైనా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని పరిశీలించి, తాత్కాలికంగా చెత్తను తొలగించడం కాకుండా శాశ్వత పారిశుద్ధ్య ప్రణాళికతో సమస్యకు ముగింపు పలకాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.
శుభ్రత అంటే అవార్డులు కాదు.. ప్రజలు నివసించే ప్రతి వీధి పరిశుభ్రంగా ఉండటమే నిజమైన ప్రామాణికం. తాడేపల్లి కొత్తూరు పశువుల ఆస్పత్రి రోడ్డు పరిస్థితి మారుతుందా? లేక మరోసారి ట్రాక్టర్ వచ్చి చెత్తను తరలించి.. సమస్యను అక్కడే వదిలేస్తారా? అన్నది వేచి చూడాలి.

# ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

**రాష్ట్రస్థాయి వేడుకలకు దీటుగా నిర్వహణ**

**ఎన్టీఆర్ జిల్లా పతాకావిష్కరణకు మంత్రి నారా లోకేశ్**

**ఏర్పాట్లలో అలసత్వం వద్దు: కలెక్టర్ లక్ష్మీశ**



విజయవాడ(ప్రశ్న న్యూస్) ఎన్టీఆర్ జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను రాష్ట్రస్థాయి కార్యక్రమాలకు దీటుగా అత్యంత ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఆగస్టు 15న విజయవాడ సింగ్‌నగర్‌లోని మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో నిర్వహించనున్న వేడుకల్లో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు.మంగళవారం స్టేడియాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యాన్‌చంద్రతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. వేదిక, ప్రేక్షకుల గ్యాలరీలు, పార్కింగ్, విద్యుత్, తాగునీరు, వైద్య సదుపాయాలు తదితర ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్నందున కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, వీఐపీలు, ఆహ్వానితులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రైన్‌ప్రూఫ్ టెంట్లను ఏర్పాటు చేయడంతో పాటు తాగునీరు, కూర్చునే సదుపాయాలు, వైద్య శిబిరాన్ని ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు.సమీక్షలో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, అదనపు డీసీపీ జి.రామకృష్ణ, ఏడీఈపీఆర్ ఎన్.వెంకటరమణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, విజయవాడ నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, పోలీసు శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆన్లైన్ ఆంక్షలతో పెన్షనర్లకు తిప్పలు

**1.5 శాతం కోత విధిస్తున్నా అందని హెల్త్ కార్డులు**




మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )తెలంగాణ ప్రభుత్వం ప్రతి నెలా పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్ల నుంచి 1.5 శాతం చందా కోత విధిస్తున్నా, వారికి క్యాష్లెస్ వైద్య సేవలు, కొత్త హెల్త్ కార్డులు అందుబాటులోకి రాకపోవడంతో రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఆన్లైన్లో డేటా అప్లోడ్ చేసే పేరుతో ప్రభుత్వం రోజుకో కొత్త ఆంక్ష తీసుకొస్తుండడంతో వయోవృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ సిటిజన్లు తమ ఆధార్ కార్డులు, ఫోటోలతో ఇంటర్నెట్ సెంటర్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. స్మార్ట్ఫోన్ల ద్వారా యాప్ ద్వారా డేటా అప్లోడ్ చేయడం అనేక మందికి సాంకేతికంగా సాధ్యం కాకపోవడంతో వేలాది మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ప్రస్తుతం వివరాలు నమోదు చేసుకున్న వారికి తాత్కాలిక పెన్షనర్ ఐడీ కార్డు మాత్రమే జారీ అవుతోందని, అసలు హెల్త్ కార్డులు ఆగస్టు 15 తర్వాతే వస్తాయని ప్రచారం సాగుతుండడంతో కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందక పెన్షనర్లు ఆందోళన చెందుతున్నారు.ఈ పథకంలో చేరాలని లేని వారికి మినహాయింపు కల్పించాలని, జాయింట్ యాక్షన్ కమిటీ, ట్రస్ట్ సభ్యులు ఇప్పటికైనా స్పందించి ఎంప్యానెల్డ్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. 2023 జూలై నుంచి రావాల్సిన పే-రివిజన్ ప్రయోజనాల కోసం పెన్షనర్లందరూ ఐక్యంగా ఉద్యమించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

# లోకక్షేమం కోసం శ్రీశైలంలో వరుణయాగం పూర్ణాహుతి

**ఐదు రోజుల శాస్త్రోక్త క్రతువులు ముగింపు..**

**సకాలంలో వర్షాలు కురవాలని ప్రత్యేక ప్రార్థనలు**



శ్రీశైలం(ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షిస్తూ శ్రీశైల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో ఐదు రోజులపాటు నిర్వహించిన వరుణయాగ సహిత సహస్ర ఘటాభిషేక మహాక్రతువు మంగళవారం శాస్త్రోక్త పూర్ణాహుతితో వైభవంగా ముగిసింది. ఆధ్యాత్మిక వాతావరణంలో వేదఘోషలు, మంత్రోచ్చారణల మధ్య జరిగిన పూర్ణాహుతి కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.ఆగస్టు 7వ తేదీన ప్రారంభమైన ఈ మహాయాగం ఆగస్టు 11వ తేదీన పూర్ణాహుతితో ముగిసింది. యాగం చివరి రోజు వేదపండితులు శాస్త్రోక్త విధానంలో నారికేళాలు, సుగంధ ద్రవ్యాలు, నూతన వస్త్రాలు తదితర పవిత్ర ద్రవ్యాలను హోమగుండంలో సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు.
అనంతరం రాష్ట్ర ప్రజల సంక్షేమం, రైతులకు సమృద్ధిగా వర్షాలు కురవడం, దేశంలో సుభిక్షం నెలకొనాలని ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.ఐదు రోజులపాటు జరిగిన ఈ యాగంలో ప్రతిరోజూ ఋష్యశృంగ జపం, వారుణానువాక పారాయణం, వరుణ జపం, భాగవత పారాయణం, విరాటపర్వ పారాయణం, పంచాక్షరి జపం, మహాన్యాస పారాయణం, రుద్ర పారాయణం, కాఠక శతానువాక పారాయణం, వేదపారాయణాలు ఘనంగా నిర్వహించారు. యాగశాల ప్రవేశం, శివసంకల్పం, ఋత్విగ్వరణం, కలశస్థాపన, రుద్రహోమం, హవనాలు వంటి వైదిక కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి.

పూర్ణాహుతి కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు ఎ.వి. రమణ, జి. గంగమ్మ, ప్రత్యేక ఆహ్వానితుడు ఆకుల శ్రీనివాసులు, అర్చక స్వాములు, వేదపండితులు, దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా వేదపండితులు రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తొలగి జలాశయాలు నిండాలని, రైతుల పంటలు సమృద్ధిగా పండాలని, సమాజంలో శాంతి, సౌభాగ్యం, సుభిక్షం నెలకొనాలని వేదాశీర్వచనాలు అందించారు. భక్తులు కూడా ఈ మహాక్రతువులో పాల్గొని లోకక్షేమం కోసం ప్రార్థనలు చేయడం విశేషంగా నిలిచింది

# ‘హృదయం మురళి’ మూవీ రివ్యూ!

అథర్వ హీరోగా రూపొందిన సినిమానే ‘ఇదయం మురళి’ (హృదయం మురళి). అథర్వ తండ్రి మురళి హీరోగా 1991లో ‘ఇదయం’ (హృదయం) సినిమా చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఆ సినిమా మ్యూజికల్ హిట్ గా యూత్ ను ఒక ఊపు ఊపేసింది. ఆ సినిమా పేరును .. తండ్రి పేరును కలుపుతూ, ఆయనను గుర్తుచేస్తూ అథర్వ ఈ సినిమా చేశాడనుకోవాలి. తమన్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా, జులై 10వ తేదీన థియేటర్లకు వచ్చింది. ఈ నెల 7వ తేదీ నుంచి ‘నెట్ ఫ్లిక్స్’లో తెలుగులోను స్ట్రీమింగ్ అవుతోంది. ‘హృదయ’ (అథర్వ) చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోతాడు. అప్పటి నుంచి మేనమామ (నట్టి సుబ్రమణ్యం) అతని ఆలనాపాలన చూస్తూ వస్తాడు. అయితే తల్లిదండ్రులు లేని కారణంగా ఒక రకమైన బెరుకు ‘హృదయ’లో ఉండిపోతుంది. ఆ కారణంగా అతను తన మనసులోని మాటను బయటికి చెప్పలేకపోతుంటాడు. కాలేజ్ లో చదువుకునే రోజులలో అతను ‘సమంత’ (ప్రీతి ముకుందన్)ను ప్రేమిస్తాడు. కానీ ఆ ప్రేమను మనసులోనే దాచుకుంటాడు. ఆ తరువాత చదువు పూర్తి చేసి చెన్నైలో జాబ్ కోసం సెర్చ్ చేస్తూ ఉంటాడు. ఆ సమయంలోనే అతనికి ‘అముద’ (కయాదు లోహార్) పరిచయమవుతుంది. డాక్టర్ గా ఉన్న ఆమెను అతను ఆరాధించడం మొదలుపెడతాడు. ఆమె పట్ల ఉన్న ప్రేమను వ్యక్తం చేయమని స్నేహితులు ఎంతగా చెప్పినా, హృదయ ధైర్యం చేయలేకపోతాడు. ఆమె తన ఊరికి వెళ్లిపోవడంతో దిగాలు పడిపోతాడు. సమంతకుగానీ .. అముదకుగాని తన మనసులోని ప్రేమను చెబితే బాగుండునని అనుకుంటాడు. ‘అదితి’తో హృదయ ఎంగేజ్ మెంట్ జరిగిన తరువాత వాళ్లిద్దరూ తారసపడతారు. అప్పుడు అతను ఏం చేస్తాడు? అనేదే కథ. టీనేజ్ లో అడుగుపెట్టిన తరువాత ప్రేమలో పడటం సహజంగా జరిగిపోతూ ఉంటుంది. అయితే అబ్బాయిలే ముందుగా తమ ప్రేమను వ్యక్తం చేయాలని అమ్మాయిలు కోరుకుంటారు. కొంతమంది అబ్బాయిలు మౌనంగా ఆరాధిస్తారే తప్ప ఆ ప్రేమను వ్యక్తం చేయడానికి జంకుతారు. అలాంటి ఒక బెరుకు వలన, మనసుపడిన అమ్మాయిలు ఎలా దూరమైపోతారనే అంశం చుట్టూ అల్లుకుంటూ వెళ్లిన కథ ఇది. ‘హృదయం’ సినిమా .. ఆ సినిమా హీరో మురళి గుర్తున్నవారికి ఇది ఒక ఫీల్ గుడ్ లవ్ స్టోరీ అనే నిర్ధారణకి వచ్చేస్తారు. కానీ ఈ సినిమాలో ఆశించినస్థాయిలో కథాబలం గానీ .. సన్నివేశాలలో ఫీల్ గాని కనిపించవు. ఫ్రెండ్స్ మధ్య ప్రేమకి సంబంధించిన అల్లర చిల్లర కామెడీతో కూడిన సీన్స్ ను వేసుకుంటూ వెళ్లారే తప్ప, ఫీల్ పై దృష్టిపెట్టలేదు. కొన్ని సీన్స్ ను ఏరుకొచ్చి అక్కడక్కడా పడేసినట్టుగా అనిపిస్తుంది. ఇక హీరో వెనుక మిత్రబృందం ఉంటుంది .. ఆ బృందంలో లేడీస్ కూడా ఉంటారు. పోనీ వాళ్లైనా హీరో మనసు పడిన అమ్మాయిల దగ్గరికి వెళ్లి, అతను ప్రేమిస్తున్న విషయాన్ని చెప్పకపోవడం మరీ విడ్డూరంగా అనిపిస్తుంది. హీరో తన మనసులోని మాట హీరోయిన్స్ కి చెప్పకుండా ఆడియన్స్



సహనానికి పరీక్ష పెడతాడు. క్రికెట్ విషయంలో గొడవపడటం .. హాస్పిటల్లో ఎవరో డెలివరీ అవుతుంటే ఇతను భర్త అనుకుని డాక్టర్లు ఇబ్బంది పెట్టడం .. తాగేసి డ్రైవ్ చేస్తూ పోలీసులకు దొరికిపోవడం .. రాజకీయ నాయకుడి అనుచరులు వెంటపడటం అనవసరమైన సీన్స్ గా అనిపిస్తాయి. ఈ కథ 1990లలో మొదలై 2024 వరకూ కొనసాగుతుంది. హీరో స్కూల్ డేస్ కి సంబంధించిన కొన్ని సీన్స్ సరదాగా అనిపిస్తాయి. అలాగే లవ్ సీన్స్ కూడా అక్కడక్కడా ఆకట్టుకుంటాయి. మొత్తంగా చూసుకుంటే మాత్రం, బలమైన కథాకథనాలు లోపించిన కంటెంట్ గానే అనిపిస్తుంది. అథర్వ .. ప్రీతి ముకుందన్ .. కయాదు లోహార్ నటన ఆకట్టుకుంటుంది. మనోజ్ పరమహంస ఫొటోగ్రఫీ ఫరవాలేదు.తమన్ బాణీలు అంతగా ప్రభావితం చేయలేదు. ప్రదీప్ రాఘవ్ ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తుంది. హీరో బాల్యం నుంచి అతని పెళ్లివరకూ నడిచే కథ ఇది. లవ్ .. కామెడీ .. ఎమోషన్స్ కి అవకాశం ఉంది.

కానీ ఈ అంశాలను కలుపుకుంటూ ఒక బలమైన కథనే కనిపించదు. ఎలాంటి ట్విస్టులు లేకుండా సాగడం మరో లోపంగా అనిపిస్తుంది. చివరివరకూ హీరోయిన్స్ కి హీరో దూర దూరంగా తిరగడం వలన, రొమాన్స్ కి అవకాశం లేకుండా పోయింది. దానిని ఆశించిన ఆడియన్స్ కి నిరాశే ఎదురవుతుంది. ఎలాంటి కొత్తదనం లేని ఓ రొటీన్ స్టోరీగానే ఇది మిగిలిపోతుందని చెప్పచ్చు.

# ఆయనో నక్క..

## నేను మాత్రం విశ్వాసమున్న కుక్కను

### - కంగనా ఘాటు వ్యాఖ్యలు!



బాలీవుడ్ నటి, రాజకీయ నాయకురాలు కంగనా రనౌత్, ప్రముఖ నటుడు నసీరుద్దీన్ షాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ దేశంలో తింటూ, పొరుగు దేశం కోసం పోరాడతారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. విద్యార్థుల నిరసనలపై బాలీవుడ్ ప్రముఖుల మౌనం గురించి గతంలో నసీరుద్దీన్ షా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ వివాదం మరోసారి రాజుకుంది. ఇటీవల నటుడు పియూష్ మిశ్రా, నసీరుద్దీన్ షా వ్యాఖ్యలను ప్రస్తావించిన ఓ వార్తను కంగనా తన సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ సందర్భంగా నసీరుద్దీన్‌ను ఉద్దేశిస్తూ.. “నిజం చెప్పాలంటే ప్రతి ఒక్కరూ ఎవరో ఒకరికి కుక్కలే. కానీ, నేను ఏ ఇంటి (దేశం) రొట్టె తింటున్నానో, ఆ ఇంటికి కాపలా కాస్తున్నందుకు, దాని కోసం పోరాడుతున్నందుకు గర్వపడుతున్నాను. నసీర్ సాబ్ ఈ దేశపు తిండి తింటారు. కానీ, పొరుగు దేశం కోసం పోరాడతారు” అని కంగనా రాసుకొచ్చారు. ఆయన్ను ఓ ‘నక్క’ (లోమ్డీ) అని అభివర్ణించిన కంగనా, తాను మాత్రం విశ్వాసపాత్రమైన కుక్కగా ఉండటానికే ఇష్టపడతానని స్పష్టం చేశారు. గతంలో విద్యార్థుల నిరసనలపై బాలీవుడ్ ప్రముఖులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించినప్పుడు నసీరుద్దీన్ షా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. “నోట్లో ఎముక ఉన్న కుక్క మొరగదు. ఆ ఎముక కిందపడగానే లేదా పళ్లు విరగ్గొట్టగానే అప్పుడు మొరుగుతుంది” అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఇటీవల జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనలకు మద్దతుగా పియూష్ మిశ్రా మాట్లాడుతూ, షా వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఇప్పుడు ఏ ‘కుక్కలు’ మౌనంగా ఉన్నాయని ప్రశ్నించారు. ఈ వార్తను షేర్ చేస్తూనే కంగనా నసీరుద్దీన్‌పై విరుచుకుపడ్డారు.

గతంలో కూడా కంగనా విద్యార్థుల ఉద్యమాలను విమర్శిస్తూ, యువతలో ఒక వర్గాన్ని ‘గట్టర్ చాప్’ అని సంబోధించి వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే.

## అల్లరి నరేష్ ‘రంభ ఊర్వశి మేనక’

# టీజర్ విడుదల..

### నవ్వులు పంచేందుకు వస్తోన్న టాలీవుడ్ కామెడీ కింగ్!




టాలీవుడ్ కామెడీ కింగ్ అల్లరి నరేష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘రంభ ఊర్వశి మేనక’ చంద్రమోహన్ చింతడ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలున్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ టీజర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో అల్లరి నరేష్ సరసన నలుగురు కథానాయికలు రాశిసింగ్, విష్ణు ప్రియా, సురభి, ప్రిషా సింగ్ నటిస్తున్నారు. తన వంశ పారపర్యంగా వచ్చిన కోరికల బుక్‌తో భుమి మీదకి రంభ, ఊర్వశి, మేనకలను పిలిచిన అనంతరం జరిగిన పరిణామలు ఏంటి అనేది ఈ సినిమా స్టోరీ.ప్రముఖ నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై వస్తున్న ఈ సినిమా పూర్తిగా వినోదాత్మక నేపథ్యంలో రూపొందుతోంది. విడుదలైన టీజర్ ఆద్యంతం నవ్వులు పూయిస్తూ, అల్లరి నరేష్ మార్క్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందని స్పష్టం చేస్తోంది. ఈ చిత్రం సెప్టెంబర్ 04న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

# డిప్యూటీ కమిషనర్ గౌరీ హెగ్డే



తమిళ అగ్ర నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా, టాలీవుడ్ టాలెంటెడ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో ‘స్లమ్ డాగ్ : 33 టెంపుల్ రోడ్’ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. బలమైన భావోద్వేగాలతో కూడిన పవర్‌ఫుల్ యాక్షన్ మిస్టరీ కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా త్వరలో విడుదల కానున్నది. సీనియర్ హీరోయిన్ టబూ ఇందులో కీలకమైన పాత్ర పోషిస్తున్నారు. ఆమె పాత్రకు సంబంధించిన పవర్‌ఫుల్ గ్లింప్స్‌ని సోమవారం మేకర్స్ విడుదల చేశారు. ఆద్యంతం స్లమ్ ఏరియా వాతావరణాన్ని పరిచయం చేస్తూ ఈ గ్లింప్స్ సాగింది. అక్కడ కారు దిగి, సిగరెట్ వెలిగించి, పరిస్థితులను తన కంట్రోల్‌లోకి తీసుకునే డిప్యూటీ కమిషనర్, ఇన్‌కమ్‌ట్యాక్స్ గౌరీ హెగ్డేగా టబూ గ్లింప్స్‌లో కనిపించారు. స్థానిక గూండాకు చెంపదెబ్బతో వార్నింగ్ ఇచ్చే సన్నివేశాన్ని బట్టి ఆమె పాత్ర ఎంత శక్తివంతంగా ఉంటుందో అవగతమైంది. పవర్‌ఫుల్ పాత్రలను డిజైన్ చేయడంలో సిద్ధహస్తుడైన పూరీ జగన్నాథ్.. టబూ పోషించిన గౌరీ హెగ్డే పాత్రను తనదైన శైలిలో ఆసక్తికరంగా తీర్చిదిద్దినట్టు గ్లింప్స్ చెబుతున్నది. సంయుక్త మీనన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో దునియా విజయ్ విలన్‌గా నటిస్తున్నారు. బ్రహ్మాజీ, వీటీవీ గణేశ్ కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సామ్ కె.నాయుడు, సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, నిర్మాతలు: పూరీ జగన్నాథ్, ఛార్మికౌర్, జేజీ నారాయణ్‌రావు కొండ్రోళ్ల, నిర్మాణం: పూరీ కనెక్ట్స్.



## వినోదభరితంగా ‘పాంచాలి పంచభర్తృక’



అగ్ర నటుడు డా.రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఫ్యామిలీ డ్రామా ‘పాంచాలి పంచభర్తృక’. సరీ ఫర్, లోల్ రిడా, రాజ్ పవన్, జెమినీ సురేశ్, వెంకట్ దుగ్గిరెడ్డి కీలక పాత్రధారులు. గంగ సప్తశిఖర్ దర్శకుడు. వెంకట్ దుగ్గిరెడ్డి, రాజ్ పవన్ శ్రీకాంత్ సెట్టివారి, సాయినాథ్ మణ్యం నిర్మాతలు. ఈ నెల 14న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌ని ఘనంగా నిర్వహించారు. ఈ సినిమా ఆద్యంతం వినోదాన్ని పంచుతుందని, తెలుగు రాష్ట్రాలతోపాటు అమెరికాలోనూ గ్రాండ్‌గా విడుదల కానున్నదని, నిర్మాతలు ప్యాషన్‌తో నిర్మించారని, జంధ్యాల, ఈవీవీ, అనిల్ రావిపూడి సినిమాల్లా ఈ సినిమాలోనూ తెర నిండా నటీనటులు ఉంటారని దర్శకుడు గంగ సప్తశిఖర తెలిపారు. ఇంకా సంగీత దర్శకుడు మహేశ్ నారాయణ, నటులు శ్రీనివాస్, థర్టీ ఇయర్స్ పృథ్వీ, బాల, యోగి, రాంకీ, నటి కుమారి అంటీ, కోడైరెక్టర్ రేష్మ కూడా మాట్లాడారు.

# మెగా ఆఫర్ కొట్టేసిందట?

గత ఏడాది సంక్రాంతికి ‘సంక్రాంతికి వస్తున్నాం’.. ఈ ఏడాది సంక్రాంతికి ‘అనగనగా ఒక రాజు’.. ఇలా వరుస సంక్రాంతి విజయాలతో పండుగ హీరోయిన్‌గా పేరు గాంచింది హర్యానా అందం మీనాక్షి చౌదరి. ప్రస్తుతం నాగచైతన్యతో ‘వృషకర్మ’ చిత్రంలో నటిస్తూ బిజీగా ఉన్నది ఈ అందాలభామ. ఇదిలావుంటే.. ఓ అపూర్వమైన అవకాశం మీనాక్షి చౌదరి తలుపు తట్టినట్టు ఫిల్మ్ వర్గాల్లో ఓ వార్త బలంగా వినిపిస్తున్నది. మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘మెగా 158’(వర్కింగ్ టైటిల్) చిత్రంలో మీనాక్షి చౌదరి నటించనున్నదట.అయితే.. ఆమెది హీరోయిన్ పాత్ర కాదని, ఓ అతిథి పాత్రలో ఆమె కనిపిస్తుందని తెలుస్తున్నది. ఈ సినిమా ఫ్లాష్‌బ్యాక్‌లో ఆమె పాత్ర ఉంటుందట. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. ఫ్లాష్‌బ్యాక్‌లో వచ్చే మెగాస్టార్ పాత్రలో చాలా వేరియేషన్స్ ఉంటాయని, మాఫియా నేపథ్యంలో ఆయన పాత్ర సాగుతుందని వినికిడి. యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధానంగా సాగే ఈ సినిమాను కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ, లోహిత్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

# ఎవరే నువ్వే..



దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా నటించిన ఫాంటసీ థ్రిల్లర్ ‘ఐయామ్ గేమ్’. నహాస్ హిదాయత్ దర్శకత్వం వహించారు. ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌ని మొదలుపెట్టారు. సోమవారం ‘ఎవరే నువ్వే..’ అంటూ సాగే తొలి గీతాన్ని విడుదల చేశారు. జేక్స్ బిజోయ్ స్వరపరచిన ఈ పాటకు సనారే సాహిత్యాన్ని అందించారు. అర్మాన్ మాలిక్ ఆలపించారు. ఈ సినిమాలో డాన్ జాన్ అనే అండర్ వరల్డ్ డాన్ పాత్రలో కనిపించనున్నారు దుల్కర్ సల్మాన్. దక్షిణభారతదేశంలోని దాదాపు 100కుపైగా లొకేషన్లలో ఈ సినిమా చిత్రీకరణ జరిపామని, ఇందులో అల్ట్రాస్టైలిష్ డాన్‌గా దుల్కర్ సల్మాన్ పాత్ర హైలైట్‌గా నిలుస్తుందని దర్శకుడు తెలిపారు. కయాదు లోహర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతాన్నందిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది.

# గట్స్ కా బాప్



సతీశ్ జై హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహించిన చిత్రం ‘గజ’. ఫర్నాజ్ శెట్టి కథానాయిక. డా.మైత్రి శరణ్ నిర్మాత. మణిశర్మ సంగీత దర్శకుడు. మైత్రీమూవీమేకర్స్ ఈ సినిమాను తెలుగులో విడుదల చేస్తున్నది. సోమవారం హైదరాబాద్‌లో ఈ సినిమా టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమానికి హీరో మంచు మనోజ్ అతిథిగా విచ్చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు.

‘ఈ సినిమాకు ‘గట్స్ కా బాప్’ అనే ట్యాగ్‌లైన్ పెట్టాను. ఈ కథకు ఆ సత్తా ఉంది. ఆడియన్‌గా ఆలోచించి రాసుకున్న కథ ఇది. ఈ టీజర్ శాంపిల్ మాత్రమే. సినిమా అంతకు మించి ఉంటుంది’ అని నమ్మకంగా చెప్పారు హీరో, దర్శకుడు సతీశ్ జై. సినిమాలో భాగమైనందుకు కథానాయిక ఫర్నాజ్ ఆనందం వెలిబుచ్చింది. అందరికీ మంచి పేరు తెచ్చే సినిమా ఇదని నిర్మాత మైత్రి శరణ్ నమ్మకం వ్యక్తం చేశారు. ఇంకా చిత్ర సమర్పకుడు చలమలశెట్టి సునీల్, సెవెన్ హిల్స్ సతీశ్, సహ నిర్మాతలు మధుసూదన్, పద్మనాభరెడ్డి, మిట్లపల్లి సురేందర్, కెమెరామేన్ జగదీశ్ చీకటి కూడా మాట్లాడారు.

# చదువు కోసం వచ్చారు..
# వేధింపుల ఫిర్యాదుతో బయటకొచ్చారు

- సౌమ్య నర్సింగ్ కాలేజీలో ఏం జరుగుతోంది.?
- కరస్పాండెంట్‌పై విద్యార్థినుల తీవ్ర ఆరోపణలు
- కలెక్టర్, ఎస్పీని ఆశ్రయించిన తల్లిదండ్రులు
-అసభ్య పదజాలంతో వేధిస్తున్నారంటూ ఫిర్యాదు
- మౌలిక సదుపాయాలు, సిబ్బంది కొరతపైనా ఆరోపణలు
- గుర్తింపు రద్దు చేసి మరో వర్సిటీకి బదిలీ చేయాలని డిమాండ్
- ఇప్పటికే ఫిర్యాదులు, తాజాగా ఎఫ్ఐఆర్ నమోదైందంటున్న విద్యార్థినులు



గుంటూరు(ప్రశ్న న్యూస్) నర్సింగ్ చదివి వైద్యరంగంలో సేవ చేయాలనే ఆశతో కళాశాలలో చేరిన విద్యార్థినులు.. ఇప్పుడు అదే కళాశాల యాజమాన్యంపై ఫిర్యాదు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత గుంటూరులోని సౌమ్య నర్సింగ్ కాలేజీపై విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు చేసిన ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. కళాశాల కరస్పాండెంట్ సమీర్ చంద్ర తమను వేధిస్తున్నారని, అసభ్య పదజాలంతో మాట్లాడుతున్నారని విద్యార్థినులు ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్, ఎస్పీని ఆశ్రయించారు. ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని, దీంతో ఉన్నతాధికారుల వద్దకు రావాల్సి వచ్చిందని వారు చెబుతున్నారు.

### తరగతి గదిలో ఉండాల్సిన విద్యార్థినులు.. అధికారుల కార్యాలయాల చుట్టూ!

విద్యార్థినులు కళాశాలలో ప్రశాంతంగా చదువుకోవాల్సి ఉండగా.. తమ సమస్యల పరిష్కారం కోసం అధికారుల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరస్పాండెంట్ సమీర్ చంద్ర తమతో అసభ్యంగా మాట్లాడుతున్నారని, అనుచిత పదజాలంతో వేధిస్తున్నారని విద్యార్థినులు ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.
ఈ వ్యవహారంపై పాత గుంటూరు పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేసినట్లు విద్యార్థినులు చెబుతున్నారు. అయినప్పటికీ పరిస్థితుల్లో మార్పు కనిపించలేదని, చివరకు తల్లిదండ్రులతో కలిసి జిల్లా స్థాయి అధికారులను ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు.

### ఒక్కటే ప్రశ్న.. విద్యార్థినులకు రక్షణ ఎక్కడ?

కళాశాల ప్రాంగణంలో విద్యార్థినులకు సురక్షితమైన, ప్రశాంతమైన విద్యా వాతావరణం కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉంటుంది. అయితే తమ విషయంలో అందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. కరస్పాండెంట్ ప్రవర్తనపై పలుమార్లు ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని వారు చెబుతున్నారు. విద్యార్థినులు చేసిన ఆరోపణల్లో వాస్తవమెంత? యాజమాన్యం వైపు నుంచి జరిగిన తప్పిదాలేమిటి? విద్యార్థినులు చెబుతున్నట్లుగా వేధింపులు జరిగాయా? జరిగితే వాటిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలకు అధికారుల సమగ్ర విచారణలో సమాధానం రావాల్సి ఉంది.

### డీఎంహెచ్‌వోను కలిసినా..

వేధింపులు ఆగకపోవడంతో విద్యార్థినులు డీఎంహెచ్‌వో విజయలక్ష్మిని కూడా కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించకపోవడంతో కలెక్టర్, ఎస్పీని కలవాల్సి వచ్చిందని వెల్లడించారు.
విద్యార్థినుల ఫిర్యాదులపై వైద్య, విద్యా, పోలీసు శాఖలు సమన్వయంతో విచారణ జరిపితేనే అసలు పరిస్థితి ఏమిటన్నది తేలనుంది. ముఖ్యంగా నర్సింగ్ కళాశాలల నిర్వహణ, బోధనా సిబ్బంది, క్లినికల్ శిక్షణ, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల భద్రత వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

### సౌకర్యాలు ఎక్కడ? సిబ్బంది ఏరీ?

కళాశాలలో తగిన మౌలిక సదుపాయాలు లేవని, అవసరమైన సిబ్బంది కూడా అందుబాటులో ఉండటం లేదని విద్యార్థినులు, తల్లిదండ్రులు ఆరోపించారు. నర్సింగ్ విద్యలో తరగతి బోధనతోపాటు ప్రాక్టికల్, క్లినికల్ శిక్షణ అత్యంత కీలకం. ఇలాంటి కోర్సులు నిర్వహించే సంస్థలో అవసరమైన మౌలిక వసతులు, అర్హత కలిగిన సిబ్బంది ఉన్నారా? అన్నది అధికారులు పరిశీలించాల్సిన అంశంగా మారింది.కేవలం ఫీజులు వసూలు చేసి విద్యార్థులకు తగిన విద్యా సదుపాయాలు కల్పించకపోతే వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### గతంలోనూ కేసులున్నాయా?

కరస్పాండెంట్ సమీర్ చంద్రపై గతంలో రెండు కేసులు నమోదయ్యాయని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. తమ ఫిర్యాదు నేపథ్యంలో తాజాగా ఎఫ్ఐఆర్ కూడా నమోదైందని తెలిపారు. అయితే ఈ కేసుల పూర్తి వివరాలు, సెక్షన్లు, దర్యాప్తు పురోగతిపై అధికారిక సమాచారం బయటకు రావాల్సి ఉంది.
ఈ ఆరోపణల నేపథ్యంలో పోలీసు అధికారులు గత ఫిర్యాదులు, ప్రస్తుత ఫిర్యాదు, ఎఫ్ఐఆర్‌లోని అంశాలను పరిశీలించి దర్యాప్తు చేయాల్సి ఉంది. ఆరోపణలు నిజమని తేలితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

### "మమ్మల్ని మరో కాలేజీకి పంపండి"

"ఇక్కడ చదువుకునే పరిస్థితి లేదు. మా భవిష్యత్తు నాశనం కాకుండా చూడండి" అంటూ విద్యార్థినులు అధికారులను కోరుతున్నట్లు తెలిపారు. సౌమ్య నర్సింగ్ కాలేజీ గుర్తింపును వెంటనే రద్దు చేసి, తమ విద్యాభ్యాసానికి అంతరాయం లేకుండా మరో గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం లేదా కళాశాలకు బదిలీ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.
తమపై ఎలాంటి ఒత్తిడి లేకుండా ఫిర్యాదులను స్వీకరించి, స్వతంత్రంగా విచారణ చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

### విచారణతోనే తేలాల్సిన నిజాలు

సౌమ్య నర్సింగ్ కాలేజీపై విద్యార్థినులు చేసిన ఆరోపణలు ఇప్పుడు జిల్లా అధికారుల ముందుకు చేరాయి. ఒకవైపు కరస్పాండెంట్‌పై వేధింపుల ఆరోపణలు.. మరోవైపు కళాశాలలో సౌకర్యాలు, సిబ్బంది కొరతపై ఫిర్యాదులు.. గత కేసులున్నాయన్న ఆరోపణలు.. తాజా ఎఫ్ఐఆర్ నమోదు జరిగిందన్న సమాచారం.. ఇవన్నీ కలిపి వ్యవహారం తీవ్రతను పెంచుతున్నాయి.
అయితే ఆరోపణలు నిజమా? కాదా? అన్నది అధికారిక విచారణలో తేలాల్సి ఉంది. విద్యార్థినుల ఫిర్యాదులపై కాలేజీ యాజమాన్యం వివరణ కూడా కీలకం. సంబంధిత రికార్డులు, సిబ్బంది వివరాలు, కళాశాల గుర్తింపు, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల ఫిర్యాదులు, పోలీసు కేసుల వివరాలను అధికారులు సమగ్రంగా పరిశీలిస్తే అసలు గుట్టు బయటపడే అవకాశం ఉంది.

## అర్హులైన వారికి చేయూత పెన్షన్లు
## దరఖాస్తుల స్వీకరణ పారదర్శకంగా జరగాలి

**చేయూత పెన్షన్ల కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు**

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) ప్రభుత్వం నూతనంగా అందించే 7 రకాల చేయూత పెన్షన్ల కు అర్హులైన వారి దరఖాస్తుల స్వీకరించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.
మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని మినీ సమావేశ మందిరం నుంచి జిల్లా అధికారులు, ఏం పి డి ఓ లు, మండల స్పెషల్ అధికారులతో గూగుల్ మీట్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈ నెల 15 నుంచి నూతనంగా ఇచ్చే చేయూత పెన్షన్ల కోసం దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన వారిని గుర్తించాలని, ప్రజా ప్రతినిధుల నుంచి, ప్రజావాణి కార్యక్రమంలో పెన్షన్ల కోసం వచ్చిన దరఖాస్తులను తక్షణమే ఎంట్రీ చేయాలన్నారు.చేయూత పెన్షన్ల దరఖాస్తుల కోసం హెల్ప్ డెస్క్ నెంబర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ప్రతి ఏం పి డి ఓ కార్యాలయం, మున్సిపల్ ఆఫీస్ వద్ద చేయూత పెన్షన్ల కోసం ప్రజలకు అవగాహన కల్పించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. వృద్ధాప్య పింఛన్లు మరియు బీడీ కార్మికుల పెన్షన్లుమినహాయించి మిగతా పెన్షన్ల దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు.
వృద్ధాప్య , బీడీ కార్మికుల పింఛన్లపై ప్రభుత్వం అనుమతించిన తర్వాత వాటిని పరిష్కరించాలన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో చేయూత పెన్షన్ల దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా అధికారులు తాహాసిల్దార్లు,ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, ఏపీవోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆకుల కృష్ణకు కన్నీటి వీడ్కోలు

**బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం**

**అందించిన మైనంపల్లి హనుమంతరావు**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) పాపన్నపేట గ్రామపంచాయతీలో కారోబార్‌గా పనిచేస్తున్న ఆకుల కృష్ణ (40) రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. విధులను బాధ్యతగా నిర్వహిస్తూ ప్రజలతో సన్నిహితంగా ఉండే కృష్ణ ఆకస్మిక మరణం కుటుంబ సభ్యులు, గ్రామస్థులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు.అంత్యక్రియల అనంతరం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పాపన్నపేటలోని కృష్ణ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపి, కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిస్తూ రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పావని, నరేందర్ గౌడ్, ముశెట్టి కిష్టయ్య, దోసని సంగమేశ్వర్, ప్రవీణ్ గౌడ్, వార్డు సభ్యులు రాజు, అజయ్, హరీష్, కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, కుర్తివాడ శ్రీధర్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## మెదక్ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ 100 శాతం పూర్తి

**కలెక్టర్ ప్రతిమాసింగ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )మెదక్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లాలో ఎన్యూమరేషన్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. జూన్ 25న ప్రారంభమైన ఈ ప్రక్రియలో ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, పరిశీలన, డిజిటలైజేషన్ పనులను నిర్ణీత గడువులో విజయవంతంగా పూర్తిచేశామని పేర్కొన్నారు.మెదక్ నియోజకవర్గంలో మొత్తం 2,20,427 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,01,705 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజేషన్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇది మొత్తం ఓటర్లలో 91.51 శాతమని పేర్కొన్నారు. మిగిలిన 18,722 మందిని అన్‌కలెక్టబుల్‌గా గుర్తించినట్లు వెల్లడించారు. వీరిలో 5,431 మంది మరణించిన వారు, 3,433 మంది డబుల్ ఎంట్రీలు ఉన్నవారు, 8,948 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, 874 మంది ఆచూకీ లభించని వారు, 36 మంది ఇతర కారణాలతో ఉన్నారని తెలిపారు.నర్సాపూర్ నియోజకవర్గంలో మొత్తం 2,32,713 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,08,499 మంది ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పూర్తయిందన్నారు. ఇది మొత్తం ఓటర్లలో 89.59 శాతమని చెప్పారు. మిగిలిన 24,214 మందిని అన్‌కలెక్టబుల్‌గా గుర్తించినట్లు తెలిపారు. వీరిలో 7,735 మంది మరణించిన వారు, 3,414 మంది డబుల్ ఎంట్రీలు ఉన్నవారు, 12,153 మంది ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిన వారు, 634 మంది ఆచూకీ లభించని వారు, 278 మంది ఇతర కారణాలతో ఉన్నారని వివరించారు.డిజిటలైజేషన్ పూర్తయిన వారి శాతం, అన్‌కలెక్టబుల్‌గా గుర్తించిన వారి శాతం కలిపి మెదక్ జిల్లాలో ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా పూర్తి చేసిన ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలను ఆమె అభినందించారు.

## అమీన్పూర్ ఆనంద్‌నగర్‌లో ఘనంగా దుర్గామాత బోనం



అమీన్ పూర్ ( ప్రశ్న న్యూస్) అమీన్పూర్ ఆనంద్‌నగర్‌లో దుర్గామాత బోనం వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. జర్నలిస్టు శిరీష తన కుటుంబ సభ్యులతో కలిసి సంప్రదాయబద్ధంగా బోనం సిద్ధం చేసి దుర్గామాతకు సమర్పించారు. ఈ



సందర్భంగా కుటుంబ సభ్యులు, స్థానిక భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.తెలంగాణలో బోనం సంప్రదాయానికి విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. అమ్మవారికి నైవేద్యంగా అన్నం, పాలు, బెల్లం తదితర పదార్థాలతో బోనం తయారు చేసి భక్తిశ్రద్ధలతో సమర్పించడం ఆనవాయితీ. తమ కుటుంబాన్ని, సమాజాన్ని అమ్మవారు సుఖశాంతులతో కాపాడాలని, అందరికీ ఆరోగ్యం, ఐశ్వర్యం, ఆనందం ప్రసాదించాలని కోరుతూ భక్తులు బోనం సమర్పిస్తారు.ద

ఈ సందర్భంగా జర్నలిస్టు శిరీష కుటుంబ సభ్యులు దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేసి, బోనాన్ని అమ్మవారి సన్నిధిలో సమర్పించారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని భక్తి గీతాలు, అమ్మవారి నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. చిన్నారులు, కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొనడంతో ఆనంద్‌నగర్‌లో పండుగ సందడి కనిపించింది.అమ్మవారికి బోనం సమర్పించడం కేవలం ఒక ఆచారం మాత్రమే కాకుండా, భక్తుడు తన కృతజ్ఞతను, విశ్వాసాన్ని దైవానికి సమర్పించే పవిత్రమైన సంప్రదాయంగా భావిస్తారు. కుటుంబ సంక్షేమం, ప్రజల శ్రేయస్సు, గ్రామం--ప్రాంతంలో సుఖశాంతులు నెలకొనాలని కోరుతూ దుర్గామాతను ప్రార్థించారు.బోనం అనంతరం కుటుంబ సభ్యులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. భక్తులు అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆకాంక్షించారు. భక్తి, సంప్రదాయం, కుటుంబ ఆత్మీయత కలగలిసిన ఈ వేడుక ఆనంద్‌నగర్‌లో ప్రత్యేక ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

## నకిలీ విలేకరులకు ఇక చెక్

**అక్రిడిటేషన్ ఉన్న జర్నలిస్టులకు ప్రత్యేక గుర్తింపు స్టిక్కర్లు**

**క్యూఆర్ కోడ్‌తో గుర్తింపు.. ఎస్పీని కలిసి ఏపీబీజేఏ వినతి**

**నకిలీ విలేకరుల ఆగడాలతో నిజమైన జర్నలిస్టులకు ఇబ్బందులు: అసోసియేషన్**



గుంటూరు(ప్రశ్న న్యూస్) జర్నలిజం ముసుగులో కొందరు సాగిస్తున్న అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్టింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ పోలీసు శాఖను కోరింది. అర్హత, గుర్తింపు లేకుండానే కొందరు నకిలీ విలేకరులుగా చలామణి అవుతూ అసలైన జర్నలిస్టుల ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక గుర్తింపు స్టిక్కర్లు జారీ చేయాలని కోరారు.ఈ మేరకు ఏపీబీజేఏ ప్రతినిధులు గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో జర్నలిస్టుల పేరుతో తిరుగుతున్న అనధికార వ్యక్తుల వ్యవహారాలపై నిఘా పెట్టాలని, నిజమైన జర్నలిస్టులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.క్యూఆర్ కోడ్‌తో గుర్తింపుపోలీసు శాఖ నుంచి అక్రిడిటేషన్ కలిగిన ప్రతి జర్నలిస్టుకు క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రత్యేక గుర్తింపు స్టిక్కర్ అందించాలని ఏపీబీజేఏ ప్రతినిధులు సూచించారు. వాహనాలపై ఈ స్టిక్కర్ ఉండేలా చర్యలు తీసుకుంటే సంబంధిత వ్యక్తి నిజమైన జర్నలిస్టా? కాదా? అన్నది ప్రాథమికంగా గుర్తించడం సులభమవుతుందని తెలిపారు.క్యూఆర్ కోడ్ ద్వారా జర్నలిస్టు పేరు, సంస్థ, అక్రిడిటేషన్ వంటి వివరాలను ధ్రువీకరించుకునే విధానం ఉంటే నకిలీ గుర్తింపులతో తిరిగే వ్యక్తులకు అడ్డుకట్ట వేయవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా పోలీస్‌స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర సున్నితమైన ప్రాంతాల్లో విలేకరుల పేరుతో అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని నియంత్రించేందుకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు.

## సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడిగా ప్రసాద్



జూలూరుపాడు(ప్రశ్న న్యూస్)జూలూరుపాడు మండల సర్పంచుల సంఘం నూతన కార్యవర్గాన్ని స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని సర్పంచుల సమక్షంలో అధ్యక్షుడిగా ప్రసాద్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడు, కోశాధికారి, ప్రచార కార్యదర్శి, సలహాదారులతో పాటు మొత్తం 10 మందితో నూతన కమిటీని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని సర్పంచులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి అధికారులతో మాట్లాడి అండగా నిలుస్తానన్నారు. పంచాయతీల అభివృద్ధి, సర్పంచుల హక్కుల కోసం కమిటీ సభ్యులతో కలిసి సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులను సర్పంచులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

# అనర్హత వైద్యం - ప్రాణప్రాయం

- నకిలీ వైద్యులచే వైద్యం వృత్తికి మకిలీ
- డబ్బు సంపాదనే లక్ష్యంగా వైద్యుల అవతారంలో నకిలీలు
- సాధారణ జబ్బులకు సైతం శక్తివంతమైన యాంటిబయోటిక్‌తో చికిత్సలు
- అవసరం లేకున్న పరీక్షలు, ఎక్స్ రేలు, స్కానింగ్ లు
- జాడేలేని అధికారుల పర్యవేక్షణ - క్లినిక్ లలో బెడ్స్ ఏర్పాటు చేసి ఇన్ పేషంట్ చికిత్సలు
- లింగ నిర్ధారణ పరీక్షలు, చిన్న చిన్న శస్త్రచికిత్సలు, అబార్షన్లు చేస్తున్నట్లు సమాచారం



**( ఆర్ కె-- ప్రశ్న న్యూస్ బ్యూరో)**

అర్హత లేని నకిలీ వైద్యుల చికిత్సలతో పేదల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. వైద్య వృత్తిపై సరైన అవగాహన లేకపోయినప్పటికి నకిలీ పట్టాలతో వైద్యుల అవతారమెత్తి అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకునే స్థోమత లేని పేదవారు నకిలీ వైద్యులను ఉచ్చులో పడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

### నకిలీలతో మకిలీ..

ఎంతో పవిత్రమైన వైద్య వృత్తి నకిలీ వైద్యుల వల్ల అప్రతిష్ట పాలవుతుంది. నకిలీ వైద్యులపై చర్యలు చేపట్టడంలో భాగంగా తెలంగాణ మెడికల్ కౌన్సిల్ నిబంధనలు లేని వారిపై ఉక్కుపాదం మోపుతు దాడులు చేస్తున్నాను, అనుకున్నంత మేరకు ఫలితాలు సాధించలేకపోతున్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకే పరిమితమైన నకిలీ వైద్యులు, క్రమంగా నగరాల్లోను అక్రమంగా క్లినిక్ లను తెరిచి దోచుకుంటున్న సంబంధిత అధికారులు నిద్రమత్తులో తూగుతున్నారు. హైదరాబాద్ మహానగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో అనధికారికంగా 80 శాతం నకిలీ వైద్యులు యదేచ్ఛగా వైద్యం అందిస్తు పేద ప్రజల ప్రాణాలను హరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, నగరాల్లోని స్లమ్ ప్రాంతాల్లో నివసించే ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వచ్చిరాని వైద్యంతో తమ పబ్బం గడుపుకుంటు సాధారణ ఆరోగ్య సమస్యలైన జలుబు, జ్వరం, దగ్గు వంటి వాటికి సైతం తీవ్రమైన జబ్బులకు ఉపయోగించే శక్తివంతమైన ఇంజెక్షన్లు, యాంటీబయాటిక్స్ ను వాడడంతో వైద్యం వికటించి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు నిత్యం జరుగుతున్నాయి.

### పరీక్షలు - ఎక్స్ రే లు- స్కానింగులు

డబ్బు సంపాదనే లక్ష్యంగా అర్హత, అవగాహన లేని వైద్యం చేస్తు పేద ప్రజల ప్రాణాలతో చెలగాటమాడతున్న నకిలీ వైద్యులు తమ వద్దకు వచ్చే రోగుల్లో భయభ్రాంతులను సృష్టించి అనవసరమైన పరీక్షలు, ఎక్స్ రేలు, స్కానింగ్ వంటి వైద్య పరీక్షలు తాము కుదుర్చుకున్న డయాగ్నోస్టిక్ సెంటర్ల నుండి కమీషన్లు తీసుకుని అడ్డంగా దోచుకుంటున్నారు. అలాగే మరికొందరు నకిలీ వైద్యులు ఒక అడుగు ముందుకేసి స్కానింగ్ సెంటర్లతో కుమ్మక్కై గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలతో అబార్షన్లు కూడా చేస్తున్నట్లు సమాచారం. "వైద్యో నారాయణో హరి" వైద్యుడు నారాయణుడితో సమానం అని, ఎంతో పవిత్రమైన వైద్యవృత్తి నకిలీ వైద్యుల ముసుగులో ఒక వ్యాపారం మారడం దురదృష్టకరమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. సరైన అర్హత లేని వారు వైద్యం చేయడం చట్టరీత్యా నేరం. నేడు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నకిలీ వైద్యుల కదలికలపై నిఘా పెట్టి వీరిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన భాధ్యత ప్రభుత్వం పై ఉంది.

### వైద్యుని అర్హతలు గమనించాలి

అనారోగ్య సమస్యలపై వైద్యున్ని సంప్రదించే ముందు అతని అర్హతలు, అనుభవం గురించి తెలుసుకోవాలి. దీనివల్ల తాము నకిలీ వైద్యుల బారినపడి ఇబ్బందులు పడే పరిస్థితుల నుండి బయటపడవచ్చు. ఒక వేళ సరైన అర్హతలు లేకపోయినను వైద్యం చేస్తున్న వారిని ప్రశ్నించే భాధ్యత ప్రతి పౌరునికి ఉంది. ప్రజలు చైతన్యవంతులై అప్రమత్తంగా ఉండి తమ చుట్టుప్రక్కల పుట్టుకొస్తున్న నకిలీ వైద్యులతో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### జాడేలేని అధికారుల పర్యవేక్షణ

కుప్పలు తెప్పలుగా పుట్టుకొస్తున్న క్లినిక్ లలో వైద్యం చేస్తున్న వైద్యుల అర్హతలు, ఆస్పత్రిని నిర్వహించేందుకు అవసరమైన అనుమతులు ఉన్నాయా అనే విషయాలపై తనిఖీలు చేయాల్సిన సంబంధిత అధికారులు విధులను నిర్లక్ష్యం చేస్తున్నారని, దీంతో నకిలీ వైద్యులు రెచ్చిపోతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో క్లినిక్ ల బోర్డులపై పేర్కొన్న వైద్యులే వైద్యసేవలు అందిస్తున్నారా లేదా అనే వివరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారుల జాడేలేదు.?

ఎక్కడైన నకిలీ వైద్యుల వైద్యంపై ఫిర్యాదులు వస్తే తప్ప ఎంతో హడావుడి సృష్టించి తనిఖీలతో సరిపెట్టి సమస్యను అటకెక్కిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని నకిలీ వైద్యులు విచ్చలవిడిగా క్లినిక్ లతో పాటు బెడ్లు ఏర్పాటు చేసి పేషంట్స్ ను అడ్మిట్ చేసుకోవడం, చిన్న చిన్న శస్త్రచికిత్సలు సైతం చేస్తు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతు సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించి నకిలీ వైద్యులచే అమాయక ప్రజల ప్రాణాలకు పొంచి ఉన్న ముప్పును నివారించాలని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# జోరుగా 'రేషన్ రీసైకిల్' దందా

- పేదల బియ్యంపై దళారుల కన్ను, తెల్లవారుజామునే తరలింపు.?
- కార్డుదారుల నుంచి కిలో రూ.12--15 కొనుగోలు..
- పాలిష్ చేసి రూ.30--40కు విక్రయం అన్న ఆరోపణలు
- నెలకు వందల టన్నుల తరలింపు జరుగుతోందంటున్న స్థానికులు. అధికారుల నిఘా ఎక్కడ.?




**మంగళగిరి(ప్రశ్న న్యూస్)** పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతోందన్న ఆరోపణలు మంగళగిరి నియోజకవర్గంలో కలకలం రేపుతున్నాయి. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా కార్డుదారులకు చేరాల్సిన బియ్యంలో కొంత భాగం దళారుల చేతుల్లోకి వెళ్లి, అక్కడి నుంచి అక్రమంగా తరలిపోతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై గతంలో పలుమార్లు ఫిర్యాదులు వచ్చినా పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.ప్రత్యేకించి తెల్లవారుజామున 3 గంటల నుంచి 5 గంటల మధ్య బియ్యం తరలింపులు జరుగుతున్నాయన్న సమాచారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రైస్‌మిల్లులు, నిల్వ కేంద్రాలు, రవాణా మార్గాలపై నిఘా సడలిన సమయంలోనే బియ్యాన్ని వాహనాల్లోకి ఎక్కించి తరలిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

### పేదల బియ్యమే లక్ష్యమా.?

ప్రభుత్వం ఉచితంగా అందించే బియ్యాన్ని కొందరు కార్డుదారుల నుంచి అధిక ధర ఆశ చూపి కొనుగోలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కిలో బియ్యానికి రూ.12 నుంచి రూ.15 వరకు చెల్లించి సేకరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇలా గ్రామాలు, పట్టణ పరిసరాల్లో పెద్ద మొత్తంలో బియ్యాన్ని ఒకచోట చేర్చి తదుపరి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు.ఈ బియ్యాన్ని పాలిష్ చేయడం ద్వారా నాణ్యమైన బియ్యంగా మార్చి మార్కెట్‌లో అధిక ధరకు విక్రయిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కిలో రూ.30 నుంచి రూ.40 వరకు విక్రయిస్తున్నారని దళారుల వ్యవహారంపై సమాచారం అందుతున్నప్పటికీ దీనిపై అధికారిక తనిఖీలు, నమూనాల పరిశీలన, స్వాధీనం వంటి చర్యలు ఎంతవరకు జరిగాయన్నది ప్రశ్నగా మారింది.

### తెల్లవారుజామునే ఎందుకు.?

సాధారణంగా ప్రజలు, అధికారులు, తనిఖీ బృందాల కదలికలు తక్కువగా ఉండే సమయాన్ని అక్రమ రవాణాదారులు ఎంచుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా తెల్లవారుజామున 3 నుంచి 5 గంటల మధ్య బియ్యం లోడింగ్, అన్‌లోడింగ్ జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు.అధికారులు దీనిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తే వాస్తవాలు బయటపడే అవకాశం ఉందని వారు అంటున్నారు. రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా తిరిగే వాహనాలు, రైస్‌మిల్లుల పరిసరాల్లో జరిగే లోడింగ్, బియ్యం నిల్వ కేంద్రాల నుంచి బయటకు వెళ్లే వాహనాలపై తనిఖీలు చేపట్టాలని కోరుతున్నారు.

### 'పట్టుకున్నది గోరంతే.. పోతున్నది కొండంత'

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై అప్పుడప్పుడు అధికారులు దాడులు నిర్వహించి వాహనాలను పట్టుకుంటున్నప్పటికీ అవి మొత్తం దందాలో చాలా చిన్న భాగమేనన్న విమర్శలు ఉన్నాయి.ఒకటి రెండు వాహనాలు పట్టుకోవడంతోనే అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడదని, అసలు మూలాలను గుర్తించి బియ్యం సేకరణ నుంచి రవాణా, నిల్వ, పాలిషింగ్, మార్కెట్ విక్రయం వరకు మొత్తం వ్యవస్థను ఛేదించాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు."పట్టుకున్నది గోరంత.. వెళ్లిపోయేది కొండంత" అన్నట్లుగా పరిస్థితి ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల నిఘా ఎక్కడ.?

రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ, విజిలెన్స్, పోలీసు తదితర విభాగాలు పనిచేస్తున్నాయి. అయినప్పటికీ ఇంత పెద్ద మొత్తంలో అక్రమ రవాణా జరుగుతోందన్న ఆరోపణలు వస్తుండటంతో ఆయా శాఖల నిఘా వ్యవస్థపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ప్రత్యేకించి రేషన్ బియ్యం ఎక్కడి నుంచి వస్తోంది? ఎవరికి విక్రయిస్తున్నారు? ఎక్కడ నిల్వ చేస్తున్నారు? ఏ వాహనాల్లో తరలిస్తున్నారు? ఎక్కడ పాలిష్ చేస్తున్నారు? చివరకు ఏ మార్కెట్‌కు చేరుతోంది? అన్న అంశాలపై సమగ్ర దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

### రాజకీయ అండ ఉందా.?

ఈ అక్రమ దందాకు కొందరు రాజకీయ నాయకులు, అధికారుల అండ ఉందన్న గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి. ఒక రాజకీయ పార్టీకి చెందిన స్థానిక నాయకుడి ప్రమేయం ఉందంటూ ప్రచారం జరుగుతున్నప్పటికీ, దీనిపై ఎలాంటి నిర్ధారిత ఆధారాలు లేదా అధికారిక ధ్రువీకరణ వెలువడలేదు.అందువల్ల ప్రచారాన్ని వాస్తవంగా పరిగణించకుండా, విచారణ ద్వారా నిజానిజాలు వెలికితీయాల్సిన అవసరం ఉంది. ఎవరి ప్రమేయం ఉన్నా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### 'పర్సంటేజీల' ఆరోపణలు.. నిజమెంత.?

అక్రమ రవాణా వ్యవహారంలో కొందరికి 'పర్సంటేజీలు' చెల్లిస్తున్నామని దళారులు బహిరంగంగానే చెప్పుకుంటున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఇవి అత్యంత తీవ్రమైన ఆరోపణలు కావడంతో దర్యాప్తు సంస్థలు ఆధారాలతో వాస్తవాలను నిర్ధారించాల్సి ఉంటుంది.
ఒకవేళ అధికారుల ప్రమేయం నిర్ధారణ అయితే అది కేవలం రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసుగా కాకుండా ప్రభుత్వ వ్యవస్థను దుర్వినియోగం చేసిన తీవ్రమైన అంశంగా పరిగణించాల్సి ఉంటుంది.

### 'నాసిరకం' పేరుతో కొత్త ప్రచారం.?

ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న బియ్యం నాసిరకంగా ఉందని కొందరు దళారులు కార్డుదారులను నమ్మించి, బియ్యం తీసుకుని నగదు చెల్లిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

దీంతో బియ్యం తీసుకోవాల్సిన లబ్ధిదారులే దానిని బయటకు విక్రయించే పరిస్థితి ఏర్పడుతోందని అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.బియ్యం నాణ్యతపై సమస్య ఉంటే అధికారులకు ఫిర్యాదు చేయాలి కానీ, దళారులకు విక్రయించడం ద్వారా పేదలకు ఉద్దేశించిన సంక్షేమ పథకం ప్రయోజనం పక్కదారి పడుతుందని అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది.

### రెండు రోజుల క్రితం విజిలెన్స్ దాడులు.. ఆ తర్వాత.?

రెండు రోజుల క్రితం మంగళగిరి పరిసరాల్లో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించినట్లు సమాచారం. అయితే ఆ దాడుల ఫలితాలు ఏమిటి? ఎంత మొత్తంలో బియ్యం పట్టుకున్నారు? ఎన్ని వాహనాలు స్వాధీనం చేసుకున్నారు? ఎవరిపై కేసులు నమోదు చేశారు? బియ్యం ఎక్కడి నుంచి వచ్చింది? ఎక్కడికి తరలిస్తున్నారు? అన్న వివరాలను అధికారులు ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉంది.దాడులు కేవలం ఫొటోలు, ప్రకటనలకే పరిమితమైతే అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడదని ప్రజలు అంటున్నారు. దాడుల అనంతరం కూడా అదే మార్గాల్లో అక్రమ రవాణా కొనసాగితే నిఘా వ్యవస్థ వైఫల్యంగా భావించాల్సి వస్తుందని వారు పేర్కొంటున్నారు.

### దందా మూలాలను ఛేదించాలి

రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవాలంటే కేవలం రోడ్డుపై వాహనాలను పట్టుకోవడం సరిపోదు. బియ్యం సేకరించే వ్యక్తులు, నిల్వ కేంద్రాలు, రవాణాదారులు, మిల్లులు, పాలిషింగ్ యూనిట్లు, కొనుగోలుదారులు, మార్కెట్ నెట్‌వర్క్ వరకు మొత్తం గొలుసును గుర్తించాల్సి ఉంటుంది.ప్రతి రేషన్ షాపు నుంచి బియ్యం పంపిణీ వివరాలు, ఈ-పోస్ రికార్డులు, నిల్వ వివరాలు, రవాణా పత్రాలు, మిల్లుల స్టాక్ రిజిస్టర్లను పరస్పరం సరిపోల్చి చూడాలని ప్రజలు కోరుతున్నారు. అనుమానాస్పద లావాదేవీలు కనిపిస్తే వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.
పేదల హక్కును కాపాడాల్సిందే రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోతే నష్టం కేవలం ప్రభుత్వానికి మాత్రమే కాదు.. పేద కుటుంబాలకూ. ఉచిత బియ్యం ద్వారా పేదలకు కల్పించాల్సిన ఆహార భద్రత దెబ్బతింటుంది. అందుకే ఈ వ్యవహారాన్ని సాధారణ అక్రమ రవాణాగా కాకుండా పేదల హక్కులకు సంబంధించిన అంశంగా చూడాల్సిన అవసరం ఉంది.మంగళగిరి నియోజకవర్గంలో నిజంగా నెలకు వందల టన్నుల రేషన్ బియ్యం పక్కదారి పడుతోందా? తెల్లవారుజామున జరుగుతున్నట్లు చెబుతున్న తరలింపుల వెనుక ఉన్నది ఎవరు? బియ్యం ఎక్కడి నుంచి సేకరిస్తున్నారు? ఏ మార్గంలో తరలిస్తున్నారు? ఎవరి వద్ద నిల్వ చేస్తున్నారు? పాలిష్ ఎక్కడ జరుగుతోంది? మార్కెట్‌లో ఎవరు విక్రయిస్తున్నారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు దొరికితేనే అసలు రేషన్ మాఫియా గుట్టు బయటపడుతుంది.ఇకనైనా అధికారులు 'మొద్దు నిద్ర' వీడి.. మూలాలపై దృష్టి పెడతారా? లేక మరో రెండు వాహనాలను పట్టుకుని దందా అరికట్టామని చేతులు దులుపుకుంటారా?మంగళగిరిలో పేదల బియ్యం పక్కదారి పడుతున్నదన్న ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు ఎప్పుడు? అధికారుల తదుపరి చర్యలే దీనికి సమాధానం చెప్పాలి.

# భారత్‌లో అరుణాచల్ అంతర్భాగం

- మార్చడం ఎవరితరం కాదన్న కేంద్రం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని విదేశాంగ శాఖ మరోసారి స్పష్టం చేసింది. అది ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగంగానే ఉంటుందని పేర్కొంది. ఈ వాస్తవాన్ని మార్చడం ఎవరితరం కాదని తేల్చిచెప్పింది. అరుణాచల్‌లో 27 ప్రాంతాలకు భారత పేర్లను అధికారికంగా గుర్తించడంపై చైనా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో భారత్ ఈ మేరకు స్పందించింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో విడదీయలేని, అంతర్భాగమని పేర్కొన్నారు. ఈ విషయంలో ఎలాంటి సందేహాలకు తావులేదన్నారు. భారత నిర్ణయాన్ని 'చెల్లదు' అంటూ చైనా చేసిన ప్రకటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ ఈ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరని స్పష్టం చేశారు. భారత్-చైనా సంబంధాల్లో సరిహద్దు అంశాలు అత్యంత కీలకమైనవని జైస్వాల్ తెలిపారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతత కొనసాగడం రెండు దేశాల విస్తృత సంబంధాలకు ఎంతో ముఖ్యమన్నారు. సరిహద్దు పరిస్థితులు ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపుతాయని స్పష్టం చేశారు.ఆగస్టు 6న జరిగిన భారత్-చైనా సరిహద్దు వ్యవహారాల సంప్రదింపులు, సమన్వయ యంత్రాంగం 36వ సమావేశంలో వాస్తవాధీన రేఖ వెంట పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతత కొనసాగించాల్సిన అవసరాన్ని భారత్ మరోసారి నొక్కి చెప్పిందన్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఇప్పటికే ఉన్న దౌత్య, సైనిక మార్గాలను కొనసాగించాలని రెండు దేశాలు అంగీకరించినట్లు జైస్వాల్ తెలిపారు. డబ్ల్యూఎంసీసీ సమావేశాలు, స్థానిక కమాండర్ స్థాయి చర్చలు సహా ఇతర అంగీకరించిన మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

# 'కేరళ' ఇకపై 'కేరళం'

- బిల్లుకు లోక్‌సభ ఆమోదం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ ప్రతిపాదించిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. మంగళవారం విపక్ష సభ్యుల నినాదాలు, నిరసనల మధ్య ఎటువంటి చర్చ లేకుండానే ఈ బిల్లును సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఫలితంగా రాష్ట్రం పేరు మార్పు ప్రక్రియలో మరో కీలక ఘట్టం పూర్తయింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో లేకపోవడంతో, ఆయన తరఫున హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ 'కేరళ (పేరు మార్పు) బిల్లు, 2026'ను ప్రవేశపెట్టారు. ఢిల్లీలో నిరసనకారులపై పోలీసుల చర్యలతో పాటు ఇతర కీలక అంశాలపై అమిత్ షా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఆందోళన చేపట్టాయి. ఈ గందరగోళ పరిస్థితుల నడుమనే బిల్లుకు సభ ఆమోదం ముద్రవేసింది. మలయాళంలో తమ రాష్ట్రాన్ని 'కేరళం' అని పిలుస్తారని, అధికారికంగా కూడా అదే పేరును ఖరారు చేయాలని కేరళ శాసనసభ 2024 జూన్‌లో తీర్మానం చేసింది. ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన అనంతరం, రాష్ట్రపతి ఈ ముసాయిదా బిల్లును రాష్ట్ర అసెంబ్లీకి పంపారు. 2026 జులైలో అసెంబ్లీ దీనికి ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ బిల్లు ఆమోదంతో రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్‌లో సవరణలు జరగనున్నాయి.

# తప్పులకు 'ఏఐ'ని నిందిస్తే కుదరదు

- బ్యాంకులకు ఆర్బీఐ గట్టి హెచ్చరిక




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంలో బ్యాంకులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. 'ఏఐ' వ్యవస్థలు తీసుకునే నిర్ణయాలకు సంబంధించి పూర్తి జవాబుదారీతనం బ్యాంకులదేనని, పొరపాటు జరిగినప్పుడు ఏఐ మోడళ్లను నిందించడం ఆమోదయోగ్యం కాదని గట్టిగా హెచ్చరించారు. మంగళవారం ముంబైలో ఫిక్కీ, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన 'ఫైబాక్ 2026' సదస్సులో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏదైనా నిర్ణయం విషయంలో అంతిమ బాధ్యత బ్యాంకుదే తప్ప, సేవలు అందించిన వెండార్‌ది, అల్గారిథమ్‌ది కాదని మల్హోత్రా స్పష్టం చేశారు. "ఈ నిర్ణయం తీసుకున్నది మోడల్ అని చెప్పడం సమర్థనీయం కాదు. రెగ్యులేటర్‌గా మేము కానీ, కస్టమర్లు కానీ ఇటువంటి సమాధానాలను ఎప్పటికీ అంగీకరించం" అని ఆయన తేల్చి చెప్పారు. మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయంగా కాకుండా, దానికి అదనపు తోడ్పాటునిచ్చే సాధనంగా మాత్రమే ఏఐని వినియోగించుకోవాలని సూచించారు.ఏఐ అందించే సిఫార్సులను విశ్లేషించగలగడం, అవసరమైనప్పుడు జోక్యం చేసుకుని వాటిని సవరించగలగడం వంటి పటిష్టమైన మానవ పర్యవేక్షణ వ్యవస్థలో అంతర్భాగంగా ఉండాలని మల్హోత్రా నొక్కిచెప్పారు. ప్రతి బ్యాంకు బోర్డు ఆమోదించిన నిర్దిష్ట ఏఐ విధానాన్ని కలిగి ఉండాలని, థర్డ్-పార్టీల నుంచి సేవలు పొందినప్పటికీ ఫలితాలకు బ్యాంకులే జవాబుదారీగా ఉండాలని స్పష్టం చేశారు. కస్టమర్ సేవలను మెరుగుపరచడం, జీఎస్టీ ఫైలింగ్స్, డిజిటల్ ఫుట్‌ప్రింట్స్ వంటి డేటా ఆధారంగా రుణ సదుపాయాలను విస్తరించడం, మోసాలను గుర్తించడం వంటి అంశాల్లో ఏఐకి అపారమైన సామర్థ్యం ఉందని గవర్నర్ పేర్కొన్నారు. అదే సమయంలో, మోడల్ పక్షపాతం, డేటా గోప్యత, సైబర్ భద్రతా ముప్పుల పట్ల బ్యాంకులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఏఐ ద్వారా జరిగే మోసాలను అడ్డుకోవడానికి కూడా తిరిగి అదే ఏఐ సాంకేతికతను ఆయుధంగా వినియోగించుకోవాలని వ్యాఖ్యానించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588